# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 169 | హైదరాబాద్ | బుధవారం 24-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00





11లో

ఏసీబీ సోదాలు.. మహబూబ్‌నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వద్ద రూ.36 కోట్ల ఆస్తుల గుర్తింపు

## ఢిల్లీలో బంగ్లాదేశ్
# హైకమిషన్ ఎదుట ఉద్రిక్తత

- దీపు చంద్ర దాస్ హత్యపై ఢిల్లీలో భారీ నిరసనలు
- ఢిల్లీలోని బంగ్లా హైకమిషన్ ఎదుట కట్టుదిట్టమైన భద్రత
- బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులపై ఆగ్రహం
- భారత్‌లో దౌత్య కార్యాలయాల భద్రతపై బంగ్లాదేశ్ ఆందోళన

11లో





11లో

### శ్రీహరికోటలో బ్లూబర్డ్ బ్లాక్2
## మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం

- అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్-6ను మోసుకెళ్లనున్న ఎల్‌వీఎం3-ఎం6
- శ్రీహరికోటలో 24 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభం
- రేపు ఉదయం 8.54 గంటలకు నింగిలోకి ఎగరనున్న రాకెట్

## చైనా, పాకిస్థాన్‌తో వివాదాలు..
### యుద్ధాలకు సిద్ధంగా ఉండాలని సీడీఎస్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు

- ఉగ్రవాదం, సరిహద్దు వివాదాలు సవాళ్లుగా ఉన్నాయన్న అనిల్ చౌహాన్
- ఇద్దరు ప్రత్యర్థులు అణుసామర్థ్యం కలిగి ఉన్నారన్న సీడీఎస్
- ఎలాంటి సవాలునైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని వ్యాఖ్య

11లో






11లో

## మావోయిస్టులకు
## మరో భారీ ఎదురుదెబ్బ

- ఏవోబీ సరిహద్దులో లొంగిపోయిన 22 మంది మావోలు
- లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు
- లొంగిపోయిన మావోయిస్టులపై రూ.2.18 కోట్ల రివార్డు



11లో

## సుప్రీంకోర్టులో ఏఎస్‌జీగా
# కనకమేడల
### కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ నేతకు కీలక పదవి

## అసెంబ్లీకి రాని కేసీఆర్ మీడియా సమావేశంలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు



11లో

- ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం కక్కుతున్నారని ఆగ్రహం
- ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నామన్న ఉపముఖ్యమంత్రి
- కేసీఆర్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నాడని వ్యాఖ్య




## సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్
# 2K26 పోస్టర్ ఆవిష్కరించిన సీఎం

- విద్యార్థుల కోసం ఏపీ సర్కార్ సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్
- గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో జనవరి 22 నుంచి ఫైనల్స్
- పాఠశాల, కళాశాల విద్యార్థులకు రెండు విభాగాల్లో పోటీలు
- రిజిస్ట్రేషన్ల కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు

11లో


# ట్రెండింగ్ లో సేవ్ ఆరావళి

కేంద్రం ఇచ్చిన సిఫార్సులను సుప్రీంకోర్టు ఆమోదించిన తరువాత 'సేవ్ అరావళి' ప్రచారం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. కేంద్రం నిర్ణయం, సుప్రీంకోర్టు తీర్పు పర్యావరణ వేత్తలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ క్రమంలో తాజాగా నిర్ణయాలు.. ఆరావళికి డెత్ వారెంట్ అంటూ కొందరు పేర్కొంటున్నారు. అయితే, కేంద్రం ఏం నిర్ణయం తీసుకుంది.. సుప్రీంకోర్టు ఏమని ఆమోదించింది.. ఆరావళికి వచ్చే ముప్పు ఏమిటి.. సేవ్ ఆరావళి ప్రచారం సోషల్ మీడియాలో ఎందుకు ట్రెండ్ అవుతోంది.. ఢిల్లీ చుట్టూ ఉన్న ఆరావళి పర్వతాల దగ్గర మైనింగ్ కి అనుమతి ఇవ్వడంతో ప్రారంభమైన రగడ తీవ్రస్థాయికి చేరింది. కంపెనీల లాభం కోసమే ఇలా ఆరావళి పర్వతాల నిర్వచనమే మార్చేశారని ప్రతిపక్షాలు నేతలు, పర్యావరణవేత్తలు ఆందోళనకి దిగారు. కేంద్రం మాత్రం 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న వాటిని పర్వతాలు అనరని.. అసలు ఆరావళి జోలికి తాము వెళ్లడం లేదని వాదిస్తోంది. దీంతో రాజకీయ రగడకి తోడు.. పర్యావరణ కోణంలోనూఆందోళనలకి తావిస్తోంది.మన దేశంలో అత్యంత పురాతనమైన పర్వతశ్రేణి ఆరావళి. ఇది 250 కోట్ల ఏళ్ల క్రితం నాటివని చెప్తారు. గుజరాత్ నుంచి రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ వరకు ఈ పర్వతాలు విస్తరించగా.. అసలు ఇతర ప్రాంతాల నుంచి ఢిల్లీకి ఇసుక తుఫాన్లు.. ధూళి వగైరా రాకుండా పెట్టని కోటలా కాపాడుతున్నాయంటారు. అసలు ఎడారులు థార్ నుంచి ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా అడ్డుపడింది కూడా ఈ పర్వతాలే. ఈ పర్వతాలలో అరుదైన ఖనిజాలు ఉన్నాయి. ప్రపంచంలో ఏ పర్వతాల్లోనైనా అరుదైన జీవ జాతులు నిక్షేపాలు ఉంటాయ్. వాటి కోసం అన్వేషణలో భాగంగా ఈ సంపద అంతా నాశనం చేస్తున్నారు.ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం 100 మీటర్ల కంటే ఎత్తు తక్కువ ఉన్న ఏ కొండలనైనా మైనింగ్ చేసుకోవచ్చంటూ.. మౌంటైన్.. అంటే పర్వతాలకు కొత్త నిర్వచనం ఇచ్చింది. దీంతో మైనింగ్ కంపెనీలకు ఆరావళిలో దారి దొరికినట్లైంది. దీనిపైనే పీపుల్ ఫర్ ఆరావలీస్ అనే స్వచ్ఛంద సంస్థ ఆందోళనకి దిగింది.ఇప్పటికే అక్రమ తవ్వకాలు, అభివృద్ధి పేరిట సాగుతున్న కట్టడాలతో? హరియానా, రాజస్థాన్‌లోని చార్ఖీ దాద్రి, భీవానీ జిల్లాల్లో ఆరావళి పర్వతాలు ధ్వంసమయ్యాయి. జీవ వైవిధ్యం నాశనమైంది. పరిస్థితి మరింత దిగజారితే ఉత్తర భారతంలో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ఆరావళిలో గనుల తవ్వకాలను సుప్రీంకోర్టు గతంలో నిషేధించినా, అక్రమ కార్యకలాపాలు మాత్రం ఆగలేదు. ఇప్పుడు పర్వతాలకు కొత్త నిర్వచనం ఇవ్వడంతో ఆరావళిలోని 90 శాతం ప్రాంతాలకు మైనింగ్ ముప్పు పొంచి ఉంది. అదే జరిగితే, దిల్లీ వరకు థార్ ఎడారి విస్తరించే ప్రమాదముంది. గాలి నాణ్యత మరింత దెబ్బతింటుంది. అనారోగ్య సమస్యలు పెరిగిపోతాయని 'పీపుల్ ఫర్ ఆరావలీస్' హెచ్చరిస్తోంది.ఈ ఏడాది జూన్ 5న స్వయంగా మోదీనే ఆరావళి గ్రీన్ ప్రాజెక్ట్ ప్రారంభించగా.. ఇప్పుడిలా అసలు పర్వతాలంటే ఏంటంటూ కొత్త డెఫినిషన్ ఇవ్వడమే విమర్శలకు తావిస్తోంది. కేంద్రం మాత్రం ప్రతిపక్షాల ఆందోళనను తప్పుబడుతోంది. తాజా నిబంధనల వల్ల పర్వతాలకు ఎలాంటి ముప్పు వాటిల్లదని స్పష్టం చేసింది. కొత్త నిబంధనలతో 90 శాతం పర్వతాలు సురక్షితంగా ఉంచుతామని భరోసా ఇస్తూ.. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులు, మార్గదర్శకాలకు అనుగుణంగానే పర్వత ప్రాంతాల రక్షణ జరుగుతోందని ప్రకటించింది. ఆరావళి ప్రాంతంలో అక్రమ మైనింగ్‌ను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి పని చేస్తామంటోంది కేంద్రం.భారత దేశంలో పురాతనమైన ఆరావళి పర్వత శ్రేణి గుజరాత్ నుంచి రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ వరకు విస్తరించి ఉంది. ఈ పర్వతాలు దేశ చారిత్ర, భౌగోళిక శాస్త్రంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. సుమారు 700 కిలోమీటర్ల పొడవున పర్వత శ్రేణి విస్తరించి ఉంది. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా 2024లో ఒక విషయం చెప్పింది. ఆరావళిలోని తక్కువ ఎత్తు ఉండే పర్వతాలు.. థార్ ఎడారి నుంచి వచ్చే ధూళి, ఇసుకను అడ్డుకోవడంలో సహజ కవచంగా పనిచేస్తోందని తెలిపింది. ఇది ఢిల్లీ ? ఎన్సీఆర్ ప్రాంతంతో సహా బహుళ రాష్ట్రాలకు భూగర్భ జల రీఛార్జ్, గొప్ప జీవవైవిధ్యాన్ని నిలబెట్టేందుకు సహాయపడుతుంది. కొంతకాలంగా ఆరావళి పర్వతాలపై ఖనిజాలకోసం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అందువల్ల క్రమంగా కొండలు తరిగిపోతున్నాయి. పర్యావరణం దారితప్పుతోంది.. ఈ పర్వతాలు తరిగిపోతూ ఉంటే చలిగాలులు ముందుగానే ఇండియాలోకి వచ్చేస్తాయి. అయితే, కేంద్ర ప్రభుత్వం ఈ పర్వతాల్లో 100 మీటర్ల కంటే (328 అడుగులు) తక్కువ ఎత్తు ఉన్న ప్రాంతాల్లో మైనింగ్ జరుపుకోవచ్చునని అనుమతి ఇచ్చింది. కేంద్రం తీరుపై పర్యావరణ వేత్తల నుంచి, పలు పార్టీల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి100మీటర్లలోపు ఉన్న వాటిని ఆరావళి పర్వతాలుగా చెప్పలేమని, పర్వతం అనేది 100 మీటర్ల కంటే ఎత్తే ఉంటుందనీ,.. అందువల్ల తాము పర్మిషన్ ఇచ్చింది పర్వతాల్ని తొలిచేందుకు కాదని కేంద్రం పేర్కొంది. స్థానిక భూభాగాల నుండి కనీసం 100 మీటర్ల ఎత్తులో ఉన్న కొండలు లేదా ఒకదానికొకటి 500 మీటర్లలోపు ఉన్నటువంటి కొండల సమూహాలు మాత్రమే ఇప్పుడు ఆరావళి శ్రేణిలో భాగంగా గుర్తించబడతాయని కేంద్రం పర్యావరణ మంత్రిత్వ శాఖ పేర్కొంది.సుప్రీంకోర్టు నిర్ణయం తరువాత పురాతన పర్వత వ్యవస్థల్లో ఒకటైన ఆరావళి కొండలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. సుప్రీం తీరుపై పర్యావరణ వేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో 'సేవ్ ఆరవళి' హ్యాష్‌ట్యాగ్‌తో ఆరావళిని రక్షించాలని సోషల్ మీడియా వేదికగా నిపుణులు, పర్యావరణ కార్యకర్తలు పిలుపునిస్తున్నారు.. అంతేకాదు.. ఆరావళిని టేప్ కొలతలు లేదా ఎత్తు ద్వారా మాత్రమే అంచనా వేయలేము. దాని పర్యావరణ ప్రాముఖ్యత ద్వారా దానిని అంచనా వేయాలని గెహ్లాట్ అన్నారు.

# క్వాంటం వ్యాలీ - కొత్త దిశ

విజయవాడ, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

అమరావతి ఇక కేవలం రాజధాని మాత్రమే కాదు. రానున్న కాలంలో దేశానికి దిశ చూపే టెక్నాలజీ కేంద్రంగా మారేందుకు అడుగులు వేస్తోంది. క్వాంటం టెక్నాలజీ వంటి అత్యాధునిక రంగంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, పరిశోధనలు, ఉద్యోగాల కల్పన.. ఆల్ ఇన్ వన్ కాన్సెప్ట్ అమరావతి నుంచే ప్రారంభం కానుంది. తాజాగా క్వాంటం వ్యాలీకి నిధులు విడుదల




చేయడంతో ఈ దిశగా ప్రభుత్వ సంకల్పం మరోసారి స్పష్టమైంది. 'ఉద్యోగాలే ఉద్యోగాలు' అన్న నినాదం కాగితాలకే పరిమితం కాకుండా, గ్రౌండ్ పై కనిపించే దశకు చేరుతోంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సీఆర్డీయే 65వ అథారిటీ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలు అమరావతి భవిష్యత్తుకు మైలురాయిగా నిలుస్తున్నాయి.క్వాంటం వ్యాలీకి సంబంధించిన ప్రత్యేక భవనాల నిర్మాణానికి టెండర్లు ఖరారు కావడం, అదనంగా మరిన్ని భవనాల నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించడం అన్నీ కలిపి అమరావతిని టెక్నాలజీ మ్యాప్‌లో మరో మెట్టు ఎక్కిస్తున్నాయి.ప్రపంచం వేగంగా మారుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, డేటా అనలిటిక్స్‌తో పాటు ఇప్పుడు క్వాంటం టెక్నాలజీ దేశాల భవిష్యత్తును నిర్ణయించే రంగంగా మారింది. కంప్యూటింగ్ శక్తిని విప్లవాత్మకంగా మార్చే ఈ టెక్నాలజీలో ముందడుగు వేయడం అంటే భవిష్యత్తును ముందే అందుకోవడమే. ఆ అవకాశాన్ని అమరావతి సొంతం చేసుకుంటోంది. క్వాంటం వ్యాలీ లక్ష్యం ఒక్క పరిశోధన కేంద్రం మాత్రమే కాదు. ఇది ఒక పూర్తి ఎకోసిస్టమ్. రీసెర్చ్ ల్యాబ్స్, స్టార్టప్ ఇన్క్యుబేషన్, ఇండస్ట్రీ భాగస్వామ్యం, గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్స్.. అన్నీ కలిసి పనిచేసే వ్యవస్థ. దీనివల్ల నేరుగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందని ప్రభుత్వ అంచనా.సీఆర్డీయే సమావేశంలో తీసుకున్న ప్రధాన నిర్ణయాల్లో ఒకటి.. క్వాంటం వ్యాలీలో ఎక్విప్‌మెంట్ కోసం ప్రత్యేక భవనం నిర్మించడం. సుమారు 43,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 103.96 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ భవనానికి టెండర్లు పిలిచి ఒ1ను ఖరారు చేశారు. ఇది రెండు ఎకరాల విస్తీర్ణంలో, టెక్నికల్ నిపుణుల డిజైన్ ప్రకారం నిర్మించనున్నారు. ఈ భవనం సాధారణ కార్యాలయంగా కాదు. అత్యాధునిక క్వాంటం పరికరాలు, సెన్సిటివ్ ఎక్విప్‌మెంట్, పరిశోధనల కోసం అవసరమైన ప్రత్యేక వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్మించనున్నారు. టెంపరేచర్ కంట్రోల్, వైబ్రేషన్ ఫ్రీ ఫ్లోర్స్, సెక్యూరిటీ అన్నీ కలిపి ప్లాన్ చేసినవిక్వాంటం వ్యాలీలో మరో రెండు భవనాల నిర్మాణాన్ని కూడా వెంటనే చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా, టైమ్‌లైన్‌కు కట్టుబడి ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. "డిజైన్ దశలోనే ఆలస్యం చేయొద్దు. పనులు మొదలైతే ఆగకూడదు" అన్నది ముఖ్యమంత్రి స్పష్టం చేసిన దిశ. ఈ రెండు భవనాలు రీసెర్చ్ టీమ్స్, స్టార్టప్స్, గ్లోబల్ కంపెనీలకు అవసరమైన ఆఫీస్, ల్యాబ్ స్పేస్‌గా ఉపయోగపడనున్నాయి. అంటే, క్వాంటం వ్యాలీ ప్రారంభ దశ నుంచే కార్యకలాపాలు గట్టిగా మొదలయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.క్వాంటం వ్యాలీ వల్ల ఉద్యోగాలు ఎలా వస్తాయి? అన్న ప్రశ్న సహజం. ఇది కేవలం ఒక ప్రభుత్వ ప్రాజెక్ట్ కాదు. ఇది ఒక మల్టీ-లేయర్ ఎకోసిస్టమ్. మొదటి దశలో నిర్మాణ పనుల ద్వారానే వందల మంది కార్మికులకు ఉపాధి. ఇంజినీర్లు, టెక్నికల్ సిబ్బంది, సపోర్ట్ స్టాఫ్? అందరూ అవసరం.రెండో దశలో పరిశోధన కేంద్రాలు ప్రారంభమవుతాయి. ఫిజిక్స్, మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న యువతకు రీసెర్చ్ అసిస్టెంట్స్, సైంటిస్ట్స్, ల్యాబ్ టెక్నీషియన్లుగా అవకాశాలు. మూడో దశలో స్టార్టప్స్. క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం సెక్యూరిటీ, క్వాంటం సెన్సార్స్ వంటి రంగాల్లో స్టార్టప్స్ రావడం ద్వారా సాఫ్ట్‌వేర్ డెవలపర్స్, డేటా సైంటిస్ట్స్, హార్డ్‌వేర్ ఇంజినీర్లకు భారీగా ఉద్యోగాలు. నాలుగో దశలో గ్లోబల్ కంపెనీలు. ఒకసారి ఎకోసిస్టమ్ ఏర్పడితే, పెద్ద కంపెనీలు అమరావతిని తమ ఆర్అండ్‌డీ హబ్‌గా ఎంచుకునే అవకాశం ఉంది. అప్పుడు ఉద్యోగాల సంఖ్య వేలల్లోకి వెళ్తుందిఇప్పటివరకు ఐటీ అంటే బెంగళూరు, హైదరాబాద్ అన్న భావన ఉండేది. క్వాంటం వ్యాలీతో అమరావతి కూడా ఆ లిస్టులో చేరనుంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ యువతకు ఇది గోల్డెన్ ఛాన్స్. బయట రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి తగ్గే అవకాశం ఉంది. ఇక్కడే చదువు, ఇక్కడే పరిశోధన, ఇక్కడే ఉద్యోగం?అన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కాలేజీలతో లింకేజ్ ఏర్పడితే, స్టూడెంట్స్‌కు ఇంటర్న్‌షిప్స్, ప్రాజెక్ట్ వర్క్స్, ప్లేస్‌మెంట్స్? అన్నీ కలిపి ప్లాట్‌ఫామ్‌గా క్వాంటం వ్యాలీ మారుతుంది. అమరావతి బ్రాండ్ బలపడేలా క్వాంటం వ్యాలీ కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు. ఇది అమరావతి బ్రాండ్‌ను గ్లోబల్ మ్యాప్‌పై నిలబెట్టే ప్రయత్నం. ఇప్పటివరకు అమరావతి అంటే పరిపాలనా రాజధాని అనే గుర్తింపు. ఇకపై టెక్నాలజీ రాజధానిగా కూడా గుర్తింపు పొందే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇది ఇతర రంగాలకు కూడా ఊతమిస్తుంది. హౌసింగ్, రియల్ ఎస్టేట్, ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్? అన్ని రంగాల్లో ఉద్యోగాలు పెరిగితే నగరంలో ఆర్థిక చక్రం వేగం పెరుగుతుంది. స్పష్టమైన విజన్ సీఆర్డీయే సమావేశంలో కనిపించింది.

# భారీగా పెరిగిన కోడిగ్రుడ్డు ధర

విజయవాడ, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

నాన్‌వెజ్ ప్రియులకు ఇది బ్యాడ్‌న్యూస్ అనే చెప్పవచ్చు. ఇప్పటికే కోడి గుడ్ల ధరలు పెరుగుతోండగా.. దానితో పాటు చికెన్ ధరలు కూడా భగ్గుమంటున్నాయి. త్వరలో క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి లాంటి ప్రధాన పండుగలు వస్తుండటంతో వివిధ ప్రాంతాలకు కోళ్ల సరఫరా పెరిగిపోయింది. దీంతో డిమాండ్ కారణంగా చికెన్ ధరలు పెరిగిపోతున్నాయి. దాణా ఖర్చులు పెరుగడంతో కోళ్ల ఫామ్స్ నిర్వహణ కూడా యజమానులకు కష్టంగా మారిపోయింది. దీంతో ధరల పెరుగుదలకు ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు. గుడ్లు, చికెన్ ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల ఇంటి ఖర్చు పెరుగుతోంది. దీంతో పండుగ వేళ సామాన్యులకు భారం తప్పడం లేదు. మరికొన్ని రోజుల పాటు ధరలు ఇలాగే కొనసాగే అవకాశముందని తెలుస్తోంది.నెల క్రిందట గుడ్డు ధర రూ.5 ఉండగా.. ఇప్పుడు ఏకంగా రూ.3 పెరిగి రూ.8కి చేరుకుంది. హోల్‌సెల్ మార్కెట్లో రూ.7.50గా ఉండగా.. రిటైలర్లు రూ.8కి విక్రయిస్తున్నారు. ఇక నాటుకోడి గుడ్డు ధర రూ.15 పలుకుతోంది. ఇక వీటితో పాటు చికెన్ ధరలు కూడా ఆమాంతం పెరిగాయి. నెలలోనే రూ.100 మేర కేజీ చికెన్ ధర పెరిగింది. నెల క్రితం రూ.190 నుంచి రూ.200 మధ్య కేజీ చికెన్ ధర కొనసాగింది. ఈ నెల ప్రారంభంలో రూ.230 వరకు చేరుకోగా.. ఆదివారం నాటికి రూ.290కి చేరుకుంది. దీంతో నెల రోజుల్లో రూ.100 మేర చికెన్ ధర పెరిగినట్లయింది. పండుగల సీజన్ కావడంతో చికెన్‌కు ఫుల్ డిమాండ్ పెరగడం, డిమాండ్‌కు తగ్గట్లు కోళ్ల ఫామ్స్ నుంచి కోళ్లు రాకపోవడంతో ధరలు పెంచుతున్నారు.ఇక కోళ్లకు వేసే దాణా ఖర్చులు కూడా భారీగా పెరిగాయి. అలాగే ఇతర ఖర్చులు కూడా పెరగడంతో చికెన్ ధరలు పెంచాల్సి వస్తోందని యజమానులు చెబుతున్నారు. అసలే త్వరలో పండుగల సీజన్ వస్తుండటంతో చికెన్ ఎక్కువగా తింటూ ఉంటారు. ఈ సమయంలో రేట్లు పెరగడం సామాన్యులకు భారం కానుందని చెప్పవచ్చు. మరో నెల రోజుల పాటు పరిస్థితి ఇలాగే ఉంటుందని, ఆ తర్వాత ధరలు తగ్గే అవకాశం ఉంటుందని పౌల్ట్రీ ఎక్స్‌పర్ట్ చెబుతున్నారు.ప్రస్తుతం ఒక్క కోడిగుడ్డు రికార్డు



స్థాయిలో రూ. 8కి చేరింది. ఇక హోల్‌సేల్ మార్కెట్లోనే ఒక్కో గుడ్డు ధర రూ.7.30 పలుకుతుండటం విశేషం. గతంలో ఒక ట్రే (30 గుడ్లు) రూ.160 నుంచి రూ.170 వరకు లభించేవి. కానీ, ప్రస్తుతం అది రూ.210 నుంచి రూ. 220కి చేరింది. కోడిగుడ్డు ధరలు ఈ స్థాయికి చేరుకోవడం పౌల్ట్రీ ఇండస్ట్రీ చరిత్రలోనే తొలిసారి అని చెబుతున్నారు. అయితే, ధరలు ఇంతలా పెరగడానికి ప్రధాన కారణం డిమాండ్ కు తగిన ఉత్పత్తి లేకపోవడమే. ఇక నాటు కోడి గుడ్ల విషయానికి వస్తే ఒక్కో గుడ్డు ధర రూ.15 వరకు పలుకుతోంది.గతంలో తెలుగు రాష్ట్రాల్లో రోజుకు సుమారు 8కోట్ల గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. అయితే, కోళ్ల ఫారాల నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతున్న నేపథ్యంలో చాలా మంది పౌల్ట్రీ యాజమానులు ఈ రంగానికి దూరమవుతున్నారు. కోళ్లకు పెట్టే దాణా, మక్కలు, సోయా, చేపపొట్టు వంటి ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల చిన్న, మధ్యతరహా రైతులు కోళ్ల ఫారాలను మూసివేస్తున్న పరిస్థితి. గతంలో కోల్డ్ స్టోరేజీల్లో దాదాపు 20కోట్ల గుడ్లు నిల్వ ఉండేవని, ప్రస్తుతం ఆ నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు.ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మరికొద్దిరోజులు కోడిగుడ్డు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. కోళ్ల దాణాపై సబ్సిడీ ఇవ్వడం లేదా ఉత్పత్తిని పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తప్ప ధరలు అదుపులోకి వచ్చే సూచనలు కనిపించడం లేదు.

# టీడీపీ నేతల్లో ఆనందం లేదెందుకంటే

విజయవాడ, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ ఎన్నికల హీట్ మొదలయింది. వచ్చే ఏడాది నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. అందులో వైసీపీకి చెందిన మూడు, టీడీపీకి చెందిన ఒక స్థానం ఖాళీ అవుతుంది. టీడీపీకి చెందిన సానా సతీష్ తో పాటు వైసీపికి చెందిన పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డితో పాటు పరిమళ్ నత్వానీ పదవీ కాలం పూర్తి కావస్తుంది. అయితే ఇదే ఇప్పుడు టీడీపీ అధిష్టానినకి తలనొప్పిగా మారింది. టీడీపీకి చెందిన సానా సతీష్ కు మరోసారి రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. ఆయన పూర్తి కాలం పదవిలో లేకపోవడంతో మరొక అవకాశం ఇవ్వాలని ఇప్పటికే నాయకత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఆ ఒక్కటీ మాత్రం సానా సతీష్ కు తిరిగి దక్కనుంది.ఖాళీ అవుతున్న నాలుగు స్థానాల్లో ఖచ్చితంగా కూటమి గెలుచుకుంటుంది. అందుకే ఈ సారి ఈ పదవులకు పోటీ ఎక్కువగా ఉందని సమాచారం. ఇక మిగిలేది మూడు మాత్రమే. ఈ మూడింటిలో టీడీపీకి దక్కేది ఒక్కటేనని తెలుస్తోంది. ఎందుకంటే పరిమళ్ నత్వానీ స్థానంలో బీజేపీ నేత ఒకరిని పోటీకి దింపేందుకు ఇప్పటికే ఒప్పందం కుదిరినట్లు సమాచారం. రాష్ట్రంలో బీజేపీ నేతకు ఈ అవకాశం ఇస్తారా? లేక జాతీయ స్థాయిలో మరొకరికి ఇస్తారా? అన్నది మత్రం తేలకపోయినా మూడింటిలో ఒక్కటి మాత్రం కమలం ఖాతాలో పడుతుంది. చంద్రబాబు నాయుడు కూడా ఇటీవల ఢిల్లీ పర్యటనలో వచ్చే ఏడాది ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానంలో మిత్రపక్షమైన బీజేపీకి ఇస్తామని చెప్పి వచ్చినట్లు కూడా హస్తిన నుంచి వినిపిస్తున్న టాక్.ఇక మరొకటి జనసేనకు ఖచ్చితంగా ఈ సారి రాజ్యసభ అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది. జనసేనకు ఇప్పటి వరకూ రాజ్యసభలో అవకాశం కలగలేదు. అయితే ఖాళీ అవుతున్న నాలుగు స్థానాల్లో ఒకటి ఇస్తామని చంద్రబాబు పవన్ కల్యాణ్ కు ఎప్పుడో మాట ఇచ్చినట్లు అంటున్నారు. జనసేన నుంచి అభ్యర్థి ముందుగానే ఖరారయినట్లు తెలుస్తోంది.

# వైసీపీలో కోల్డ్ వార్...

కర్నూలు, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినప్పటి నుంచి వైసీపీ డిఫరెంట్ సిచ్యువేషన్స్‌ను ఫేస్ చేస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు పార్టీలో అంతా తామేనని.. ముందుండి నడిచిన నేతలంతా సైలెంట్ అయిపోయారు. మాజీ మంత్రులు, కీలక పదవులు చేపట్టిన నేతలు..ఓడిపోగానే సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. చాలా నియోజకవర్గాలకు ఇంచార్జ్‌లు కూడా లేని పరిస్థితి. ఇప్పుడిప్పుడే నియోజకవర్గ ఇంచార్జ్‌లను నియమించడం..ఇంచార్జ్‌లు యాక్టీవ్‌గా లేని నియోజకవర్గాల్లో మరొకరికి బాధ్యతలు అప్పగించడం వంటి డెసిషన్ తీసుకుంటున్నారు వైసీపీ అధినేత జగన్.ఈ క్రమంలో పార్టీ యాక్టివిటీ..ముందుండి నడిపించే నాయకులు లేక జిల్లాల్లో క్యాడర్ నిరాశలో ఉందన్నది వైసీపీ వర్గాల టాక్. చాలా నియోజకవర్గాల్లో వైసీపీ క్యాడర్, లీడర్లు సైలెంట్ మోడ్‌లోనే ఉన్న పరిస్థితి. కానీ కొన్ని నియోజకవర్గాల్లో మాత్రం ఇప్పటినుంచే టికెట్ ఫైట్ నడుస్తోంది. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు నేతలు. నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతల కోసం ఓవైపు..ఇంచార్జ్ బాధ్యతల నుంచి తప్పించినా అదే నియోజకవర్గంలో కంటిన్యూ అయ్యేందుకు మరికొందరు ఎవరి ప్రయత్నాల్లో వారు బిజీగా ఉన్నారు.ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు నియోజకవర్గంలో వైసీపీలో వర్గ విభేదాలు పీక్‌కు చేరాయి. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాజీ ఎంపీ బుట్టా రేణుక మరోవైపు యువ నాయకుడు రాజీవ్ రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య కోల్డ్ వార్ రచ్చకెక్కుతుంది. ఎవరికి వారు బల ప్రదర్శనలు చేయడం, పార్టీ లైనుకు భిన్నంగా పోటాపోటీగా కార్యక్రమాలు చేయడం చర్చకు దారితీస్తోంది. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఎమ్మిగనూరు వైసీపీలో విభేదాలు హీటెక్కాయి. బుట్టా రేణుక వర్గం ఒక కార్యక్రమం చేపట్టగా, రాజీవ్ రెడ్డి వర్గం మరోలా కోటి సంతకాల సేకరణలో పాల్గొన్నాయి. పార్టీ నేతలంతా కలిసి కోటి సంతకాలు సేకరణ పూర్తి చేయాలని వైసీపీ అధినేత జగన్ భావించారు. అదే విధంగా క్షేత్రస్థాయిలోనూ చెప్పుకొచ్చారు. కానీ ఆ పరిస్థితి కనిపించలేదు. ఇతర చోట్ల పరిస్థితి ఎలా ఉన్నా.. ఎమ్మిగనూరులో మాత్రం బుట్టా రేణుక వర్సెస్ రాజీవ్ రెడ్డి వర్గపోరు మరోసారి హాట్ టాపిక్ అయింది.బలమైన రెడ్డి సామాజిక వర్గం అంతా తనవైపే ఉందని రాజీవ్ రెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేస్తుండగా జగన్ చెప్పిందే తాను చేస్తున్నానని బుట్టా రేణుక వాదిస్తున్నారు. వచ్చే ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉన్నప్పటికీ విభేదాలు పెట్టుకొని పార్టీలో చీలికలు తెస్తున్నారని క్యాడర్ రగిలిపోతోందట. ఎవరి తరపున మాట్లాడితే ఎవరికీ కోపం వస్తుందో..ఏ నేతకు మద్దతు తెలిపితే ఎవరికి కోసం వస్తుందోనన్న డైలమా కార్యకర్తల్లో నెలకొందట. ఇటు బుట్టా, అటు రాజీవ్‌రెడ్డి వర్గాలు ఆర్థికంగా బలంగా ఉండడం, రెండు వర్గాలకు అంతో ఇంతో ప్రజాబలం ఉండటంతో ఎవరినీ కాదనలేని పరిస్థితిలో పార్టీ అధిష్టానం ఉందట. ఎమ్మిగనూరులో పరిణామాలను పార్టీ అధిష్టానం సీరియస్ తీసుకోకపోవడానికి ఇదే కారణమంటున్నారు. టికెట్ ఫైటే కాదు..ప్రజల్లోకి వెళ్లేప్పుడు కూడా ఎవరికి వారుగా వెళ్లడం ఎవరికి వారుగా కార్యక్రమాలు చేపట్టడం వంటివి క్యాడర్‌లో ఆందోళనకు దారితీస్తున్నాయట.2024 ఎన్నికల్లో ఎమ్మిగనూరు నుంచి బుట్టా రేణుక పోటీ చేశారు. ఆ తర్వాత వైసీపీ నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఏడాదిన్నరగా కొనసాగుతూ వచ్చారు. అయితే బుట్టా రేణుక రాజకీయ ఎదుగుదల..మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి, ఆయన వర్గీయులకు మింగుడు పడటం లేదట. ఎలాగైనా ఆమెను ఎమ్మిగనూరు నుంచి పంపించాలని పట్టుబట్టి..ఇప్పటికే బుట్టా రేణుకను ఎమ్మిగనూరు వైసీపీ ఇంచార్జ్ పదవి నుంచి తప్పించారు. ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మనుమడు రాజీవ్‌రెడ్డిని వైసీపీ ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే నియోజకవర్గం ఇంచార్జ్ బాధ్యతల నుంచి తప్పించినా..పార్లమెంటు సమన్వయ కర్తగా బుట్టా రేణుక ఎమ్మిగనూరులో తన వర్గాన్ని కాపాడుకుంటూ వస్తున్నారట.

# కడపలో రెడ్డప్ప గారి రాజకీయానికి చెక్

కడప డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

ఏపీ రాజకీయాల్లో కడప జిల్లాది ప్రత్యేక స్థానం. ఎందుకంటే దశాబ్దాలుగా అక్కడ వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబ హవా నడిచింది. నందమూరి తారక రామారావు లాంటి నేతలు సైతం కడప విషయంలో అనేక రకాల ఆలోచనలు చేశారు. కానీ అనుకున్న స్థాయిలో సక్సెస్ కాలేకపోయారు. కడపలో ఏకపక్ష విజయం తెలుగుదేశం పార్టీకి ఎప్పటికీ లోటే. రాజశేఖర్ రెడ్డి ఉన్నంతవరకు కాంగ్రెస్ పార్టీకి ఆ జిల్లాలో తిరుగులేదు. జగన్మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హవా నడిచింది. కానీ గడిచిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. పది అసెంబ్లీ సీట్లకు గాను ఏడు చోట్ల టిడిపి కూటమి గెలుపొందింది. నేతలంతా సమన్వయంతో పని చేయడంతో ఇదంతా సాధ్యమైంది. అయితే రాజశేఖర్ రెడ్డి కుటుంబంలో జరిగిన పరిణామాలకు.. కడపలో రెడ్డప్ప గారి కుటుంబం దూకుడు తోడు కావడంతో టిడిపి కూటమికి ప్లస్ గా మారింది. రెడ్డప్ప గారి మాధవి రెడ్డి కడప ఎమ్మెల్యేగా విజయం సాధించగా.. ఆమె భర్త శ్రీనివాస్ రెడ్డి టిడిపి జిల్లా అధ్యక్షుడిగా చాలా ఏళ్లుగా కొనసాగుతూ వచ్చారు. ఇప్పుడు టిడిపి అధ్యక్ష పదవి నుంచి రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డిని తొలగించారు. ఇది కడప జిల్లాలో పొలిటికల్ హీట్ పెంచింది.తెలుగుదేశం పార్టీ కూటమి కడప జిల్లాలో విజయం సాధించింది. ఫలితాలు వచ్చాక మాత్రం నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డికి పార్టీ హై కమాండ్ ఫ్రీ హ్యాండ్ ఇవ్వడంతో ఆయన ఎవరిని లెక్క చేయలేదు. పార్టీ మంచి విజయం సాధించి పట్టు నిలుపుకోవాల్సిన సమయంలో నేతల మధ్య విభేదాలు పెరుగుతుండడం పై హై కమాండ్ ఆందోళన చెందింది. ఇటువంటి తరుణంలో రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డిని టిడిపి అధ్యక్ష బాధ్యతల నుంచి తొలగించడం నిజంగా సాహసమే. ఎందుకంటే కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ పట్టు సాధించడానికి ఆ కుటుంబమే కారణం. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. టిడిపి నేతల ఒత్తిడికి చంద్రబాబు తలొగ్గాల్సి వచ్చింది.రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ టిడిపి పగ్గాలు తీసుకొని చాలా ఏళ్లు అవుతోంది. వాస్తవానికి తెలుగుదేశం పార్టీ అత్యంత క్లిష్ట సమయంలోనే ఆయన అధ్యక్ష పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయన గత ఐదేళ్లకు పైగా ఆ పదవిలో ఉన్నారు. టిడిపి అధ్యక్ష బాధ్యతలు అంటేనే ఎవరు ముందుకు రాని రోజుల్లో నేనున్నాను అని ముందుకొచ్చి ఆ బాధ్యతలు స్వీకరించారు. అయితే కూటమి గెలిచిన తర్వాత టిడిపి నేతలతో ఆయనకు విభేదాలు ఏర్పడ్డాయి. సహజంగానే చంద్రబాబుపై ఈ విషయంలో ఒత్తిడి పెరిగింది. అందుకే ఆయన స్థానంలో భూపేష్ రెడ్డిని నియమించారు చంద్రబాబు. ఆయన బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి స్వయానా అన్న కొడుకు. 2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఆదినారాయణ రెడ్డి టిడిపిలోకి ఫిరాయించారు. 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి టార్గెట్ అవుతానని భావించి బిజెపిలో చేరారు. కానీ ఆయన అన్న కుమారుడు టిడిపిలోని కొనసాగుతూ వచ్చారు. 2024 ఎన్నికల్లో జమ్మలమడుగు టిడిపి అభ్యర్థిగా భూపేష్ రెడ్డి అంత సిద్ధం చేసుకున్నారు. కానీ చివరి నిమిషంలో బిజెపితో పొత్తు కుదరడంతో ఆ సీటు ఆ పార్టీకి వెళ్ళింది. బాబాయ్ కోసం ఆ సీటు వదులుకున్నారు భూపేష్ రెడ్డి. కడప పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. దీంతో ఆయనకు టిడిపి జిల్లా అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టారు చంద్రబాబు. అయితే అదే అధ్యక్ష పదవి కోసం రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి వ్యతిరేకులు ప్రయత్నించారు. చివరకు రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి అభిప్రాయాన్ని తీసుకుని భూపేష్ రెడ్డిని నియమించినట్లు తెలుస్తోంది.

# ఏపీలో కమలం సరికొత్త స్ట్రాటజీస్..!

విశాఖపట్టణం, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు..దేశం మొత్తం బీజేపీ పాలిత రాష్ట్రాలుగా ఉండాలనేది కమలనాథుల కల. ఈ ఎజెండాతోనే 2014లో మోదీ పీఎ అయినప్పటి నుంచి..అయితే సొంతంగా..లేకపోతే కూటమి పక్షాలతో కలిపి ఒక్కో రాష్ట్రంలో జెండా పాతుతూ వస్తోంది బీజేపీ. అయితే ఏపీకి వచ్చేసరికి బీజేపీ డిఫరెంట్ సినారియోను ఫేస్ చేస్తోంది.కూటమిలో భాగంగా ఉంది. కేంద్రంలో జనసేన, టీడీపీ మద్దతు కీలకమైంది. అయినా నవ్యాంధ్రలో సొంతంగా బలపడాలనే ఆకాంక్షను మాత్రం వదిలిపెట్టడం లేదు కమలం పార్టీ లీడర్లు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నట్లుగా అధికారం ఉండగానే పార్టీని బలోపేతం చేసుకునే ప్లాన్‌లో ఉన్నారట. జాతీయ నాయకత్వం డైరెక్షన్స్ ప్రకారం అడుగులు ముందుకు వేస్తున్నారు ఏపీ బీజేపీ నేతలుగత ఎన్నికల్లో ఏపీలో బీజేపీ ఎనిమిది ఎమ్మెల్యే, మూడు ఎంపీ స్థానాలను గెలుచుకుంది. ఇక ఒక ఎమ్మెల్సీ పదవితో పాటు కొన్ని నామినేటెడ్ పోస్టులను ఆ పార్టీకి కూటమి పొత్తులో దక్కాయి. అలాగే రెండు రాజ్యసభ సీట్లు సొంతం చేసుకుంది. అయితే బీజేపీకి దక్కిన సీట్లు, నామినేటెడ్ పదవులు..పొత్తు వల్లనే అన్నది కమలనాథులతో పాటు ప్రజలందరికీ తెలిసిన ఓపెన్ సీక్రెట్.బీజేపీ 2014లో టీడీపీతో కలిసి 4 ఎంపీ, 4 ఎమ్మెల్యే సీట్లను గెలుచుకుంది. 2019లో సింగిల్‌గా పోటీ చేసే సరికి ఓటు షేర్ ఒక్క శాతం కంటే పెద్దగా రాలేదు. 2024లో మళ్లీ పొత్తుతో కమలం మరోసారి సత్తా చాటింది. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్నా..ఏపీలో కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయినా..ఏపీలో బీజేపీకి పట్టున్న ప్రాంతం ఏదంటే టక్కున సమాధానం చెప్పలేని పరిస్థితి. అర్బన్ ఏరియాల్లో బీజేపీ పట్ల జనం సానుభూతితో ఉండటం కామనే. కానీ రూరల్ ఏరియాలో మాత్రం అంతంత మాత్రమే. అయితే పట్టణ ప్రాంతాల్లో బీజేపీ బలాన్ని మరింత పెంచుకునేందుకు



సరికొత్త వ్యూహాన్ని తెరమీదకు తెచ్చారు కమలనాథులు.బీజేపీ సీనియర్ నేత దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయ్ శత జయంతి వేడుకలను పెద్దఎత్తున నిర్వహించి.. విద్యావంతులను, పట్టణ ప్రాంత వాసులను తమవైపు తిప్పుకోవాలని చూస్తోందట. దీంతో వాజ్ పేయ్ శత జయంతి పేరిట యాత్ర అనంతపురం నుంచి ప్రారంభమైంది. శ్రీకాకుళం నుంచి విజయనగరం, విశాఖ దాకా సాగనుంది. గోదావరి జిల్లాలు, కృష్ణా గుంటూరులో కూడా ఈ యాత్ర నిర్వహించి 25న అమరావతిలో భారీ బహిరంగ సభతో ముగిస్తారట.వాజ్ పేయ్ పాలన, పనిలో పనిగా మోదీ అడ్మినిస్ట్రేషన్‌ను వివరిస్తూ జనం మద్దతు కూడగట్టే వ్యూహరచన చేస్తోందట బీజేపీ. దీనికి కేంద్రమంత్రులను బీజేపీకి చెందిన ఇతర రాష్ట్రాల సీఎంలను తీసుకొస్తున్నారు. అలాగే బీజేపీ నేషనల్ లీడర్లను కూడా ఏపీకి రప్పిస్తూ ఇప్పుడు మోదీ నాయకత్వంలో, అంతకు ముందు వాజ్ పేయ్ పాలనలో దేశానికి జరిగిన అభివృద్ధి ఏంటి.? తీసుకొచ్చిన సంస్కరణలేంటి.? అన్నదానిపై వివరించే ప్రయత్నం చేస్తున్నారుత్వరలో ఏపీలో జరగబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బీజేపీ తనదైన పావులు కదుపుతూ..కార్యాచరణను రూపొందిస్తోందట. ఎక్కువ సీట్లను తాము తీసుకోవడం ద్వారా గ్రౌండ్ లెవల్‌లో బలపడితే అది 2029 ఎన్నికలకు ప్లస్ పాయింట్ అవుతుందని లెక్కలు వేసుకుంటుంది. అప్పుడు కనీసం 20 సీట్ల దాకా పొత్తులో భాగంగా గెలుస్తామనేది కమలనాథుల అంచనా అంటున్నారుదీనికి తోడు ఈ మధ్యే ఏపీ బీజేపీ ఎంపీల మీట్‌లో ప్రధాని మోదీ చేసిన దిశానిర్దేశం కూడా పనిచేస్తుందని అంటున్నారు. ఏపీలో వైసీపీపై ఎటాక్ స్టార్ట్ చేయాలని మోదీ సూచించినట్లు చెబుతున్నారు. దీంతో వైసీపీ ఓటు బ్యాంకును తమవైపునకు తిప్పుకోవాలనేది బీజేపీ స్కెచ్ అన్న టాక్ వినిపిస్తోంది. ఏపీలో బలపడేందుకు బీజేపీ వేస్తున్న మాస్టర్ ప్లాన్స్ ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి మరి

# వన్ స్టాప్ సొల్యూషన్ యాప్

నెల్లూరు, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పురమిత్ర పేరుతో కూటమి ప్రభుత్వం ఓ యాప్‌ను గతంలో అందుబాటులోకి తెచ్చింది. తాజాగా ఈ యాప్‌లో పలు మార్పులు చేశారు. ఇక నుంచి ప్రజలు సమస్యలు మరింత త్వరగా పరిష్కారం కానున్నాయి.ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ఏపీ ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను గతంలో తీసుకొచ్చింది. ఈ యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకుని ప్రజలు ఫొటోలతో సహా తమ సమస్యను అప్‌లోడ్ చేయవచ్చు. ప్రభుత్వ వీలైనంత త్వరగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని స్థానిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నారు.అధికారులు సమస్యలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నారు. అయితే తాజాగా ఈ యాప్‌కి సంబంధించి ఏపీ ప్రభుత్వం పలు కీలక మార్పులు చేసింది. ఒక ప్రాంతంలో ఒకే అంశంపై ఐదుకిపైగా ఫిర్యాదులు వస్తే మున్సిపల్ కమిషనర్ల లాగిన్‌లో ఆరెంజ్ కలర్ హాట్‌స్పాట్లుగా కనిపిస్తాయి. వీటిని పరిష్కరించడానికి అధికారులు తమ క్షేత్రస్థాయి పర్యటనల్లో హై ప్రయారిటీ ఇవ్వాల్సి ఉంటుంది.ఒక సమస్యపై ఏదైనా ప్రాంతంలో ఐదుకిపైగా ఫిర్యాదులు వస్తే అవి కమిషనర్ల దృష్టికి ఆటోమేటిక్‌గా వెళ్తాయి. కమిషనర్ల లాగిన్స్‌లో అవి హాట్‌స్పాట్లుగా కనిపించడం వల్ల వెంటనే చర్యలు తీసుకోవడానికి వీలుంటుంది. నగరపాలక, మున్సిపల్, నగర పంచాయితీల కమిషనర్ల లాగిన్స్‌లో ఈ కొత్త మార్పు కనిపించనుంది.ఇలా ఒకే సమస్యపై ఐదు మందికిపైగా ఫిర్యాదు చేసినప్పుడు అది హాట్‌స్పాట్‌గా యాప్‌లో కనిపించడం వల్ల అక్కడ సమస్య తీవ్రంగా ఉందని అధికారులకు అర్థమవుతుంది. దీని వల్ల అధికారులు వెంటనే అప్రమత్తమై ప్రత్యేక దృష్టి పెట్టవచ్చు. దీని వల్ల ప్రజల సమస్యకు కూడా వెంటనే పరిష్కారం లభిస్తుంది.అంతేకాకుండా అధికారులందరూ కలిసి సమస్యను పరిష్కరించడానికి ఇది ఉపయోగపడుతుంది. అలాగే అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ సమస్యను పరిష్కరించాలి. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించినట్లు యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. స్ట్రీట్ లైట్స్, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్య, కుక్కలు, దోమల బెడద వంటి సమస్యలను కమిషనర్ల స్థాయిలోనే పరిష్కరించాలి.

# మెస్సీ టూర్ లో 100 కోట్లా... రంగంలోకి ఈడీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

అర్జెంటీనా ఫుట్బాల్ ఆటగాడు మెస్సి ఇటీవల తన గోట్ టూర్ భాగంగా ఇండియాకు వచ్చాడు. ఈ క్రమంలో కోల్ కతా లో ముందుగా పర్యటించాడు. అక్కడి సాల్ట్ లేక్ స్టేడియంలో నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల 22 నిమిషాల్లోనే మైదానం నుంచి వెళ్లిపోయాడు.. హైదరాబాదులో అతని టూర్ సజావుగానే సాగింది. ముఖ్యమంత్రి స్వయంగా ఫుట్బాల్ ఆడాడు. దీంతో సందడి వాతావరణం ఏర్పడింది. ముంబైలో కూడా నిర్వహించిన గోట్ టూర్లో సచిన్ నుంచి మొదలుపెడితే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వరకు అందరూ హాజరయ్యారు.కోల్ కతా టూర్ లో నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల పెను దుమారం ఏర్పడింది. దీంతో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. ఆ రాష్ట్రానికి చెందిన క్రీడా శాఖ మంత్రి రాజీనామా కూడా చేయాల్సి వచ్చింది. అంతేకాదు శతద్రు అనే వ్యక్తిని కూడా పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక్కడితోనే ఈ వివాదం ఆగిపోవడం లేదు. ఈ వ్యవహారాన్ని లోతుగా దర్యాప్తు చేస్తేగ్ర్భాంతికరమైన వాస్తవాలు తెలుస్తున్నాయని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన దర్యాప్తు సంస్థ చెబుతోంది. దీనికి సంబంధించి జాతీయ మీడియాలో వార్తలు కూడా వస్తున్నాయిమెస్సీ టూర్ లో భారీ కుంభకోణం చోటుచేసుకుందని తెలుస్తోంది. జాతీయ మీడియాలో వస్తున్న వార్తలు, సిట్ దర్యాప్తు జరుపుతున్న తీరు ప్రకారం దాదాపు 100 కోట్ల కుంభకోణం జరిగి ఉంటుందని సమాచారం. మెస్సీ తో ఫోటోలు దిగడం, టికెట్ల విక్రయాలలో అవకతవకలు చోటు చేసుకన్నాయని తెలుస్తోంది. ఇప్పటికే ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి ఇంట్లో సోదాలు కూడా జరిపారు. అతని ఖాతాలో ఉన్న 22 కోట్లను సీజ్ చేశారు. ప్రత్యేక దర్యాప్తు సంస్థ దీనిని లోతుగా విచారిస్తోంది. కోల్ కతా లోని శతద్రు ఇంటికి వెళ్లి చూసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది.



అతడి సామ్రాజ్యాన్ని చూసి నోరు వెళ్ళబెట్టింది.దాదాపు మూడు అంతస్తులలో అతడు భవనాన్ని నిర్మించుకున్నాడు.. తన ఇంటిపై ఏకంగా అతడు ఫుట్ బాల్ మైదానాన్ని నిర్మించుకున్నాడు. అతి పెద్ద ఈతకొలను.. అన్ని రకాల సౌకర్యాలు ఉన్న కార్యాలయం.. అతడు నివసిస్తున్న ఇంట్లో ఉన్నాయని ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు గుర్తించారు..మెస్సి టూర్ ద్వారా శతద్రు బృందం భారీగా సంపాదించిందని.. 100 కోట్ల వరకు వెనకేసుకుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెస్సి తో ఫోటో దిగడానికి పది నుంచి 30 లక్షల వరకు నిర్వాహకులు వసూలు చేశారు. మీ చెల్లింపులకు సంబంధించి అధికారికంగా ఎటువంటి లెక్కలు చూపించలేదు. టికెట్ల విక్రయాలలోను భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలోనే శతద్రు ఖాతాలో ఉన్న 22 కోట్లను పోలీసులు సీజ్ చేశారు. ఇంకా లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని విషయాలు వెలుగు చూస్తాయని తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో కూడా మెస్సి పర్యటించిన నేపథ్యంలో.. ఇక్కడ కూడా అక్రమాలు జరిగి ఉంటాయని ప్రతిపక్ష గులాబీ పార్టీ ఆరోపిస్తోంది. అయితే దీనిపై కాంగ్రెస్ పార్టీ కూడా అదే స్థాయిలో విమర్శలు చేస్తోంది. అడ్డగోలుగా మాట్లాడటం గులాబీ పార్టీకి అలవాటైపోయిందని మండిపడుతోంది.

# కలకలం రేపుతున్న ఎఫ్ స్టీన్ ఫైల్స్

న్యూఢిల్లీ, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

ప్రపంచవ్యాప్తంగా ఎఫ్ స్టీన్ ఫైల్స్ ఎంతటి సంచలనం సృష్టిస్తున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ వ్యవహారంలో వేలాది ఫోటోలు ఉన్నాయని.. ప్రపంచప్తంగా పెద్ద మనుషులుగా చలామణి అవుతున్న వ్యక్తులంతా ఇందులో ఉన్నారని అమెరికా మీడియాలో ప్రధానంగా వార్తలు వస్తున్నాయి. దీనికి తోడు మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ నుంచి మొదలు పెడితే.. ట్రంప్ వరకు అందరూ ఉండడంతో ఒక్కసారిగా కలకలం నెలకొంది.ఇటీవల అమెరికా మీడియాలో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ ఫోటోలు దర్శనమిచ్చాయి. అతడితో పాటు కొంతమంది అమ్మాయిలు కూడా ఉన్నారు. కొన్ని ఫోటోలు అత్యంత దారుణంగా ఉన్నాయని.. అవి బయట పెడితే ఆ ప్రముఖుల అసలు గుట్టు బయటపడుతుందని చాలామంది అనుకున్నారు. అయితే ఇందులో కొంతమేర మతలబు చోటుచేసుకుంది. అంతేకాదు ట్రంప్ ఫోటోలు కూడా మాయమయ్యాయి. దీంతో తెరవెనక ఏదో జరిగి ఉంటుందని అందరు అనుకున్నారు. అయితే ఊహించని విధంగా సోమవారం తెల్లవారుజామున కొన్ని ఫోటోలు బయటకు రావడంతో మరోసారి కలకలం ఏర్పడింది.ఎప్ స్టీన్ వ్యవహారానికి సంబంధించిన దాదాపు 16 ఫైల్స్ మాయమైనట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు కొద్దిరోజులుగా వ్యాఖ్యానిస్తున్నాయి. అయితే వీటిలో న్యాయశాఖ సంబంధించిన వెబ్ పేజీ నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోటో మళ్లీ ప్రత్యక్షమైంది. కొద్ది రోజులు ఈ ఫోటో మిస్ అయినట్టు అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ ఫోటోకు సంబంధించి తాత్కాలికంగా రివ్యూ కోసమే తొలగించామని అమెరికా న్యాయశాఖ అధికారులు చెప్పడం గమనార్హం. అయితే ఆ ఫోటోలో ట్రంప్ తన భార్య మెల్లనియ, ఎప్ స్టీన్, అతడి స్నేహితురాలు గిస్లైన్ మాక్స్ వెల్ కనిపించారు.ట్రంప్ ఫోటో మాయం వెనక అమెరికాను ఆశాక అధికారులు స్పందించారు. ఈ వ్యవహారంలో ఉన్న యువతులకు సంబంధించిన గుర్తింపులు, ఇతర వ్యవహారాలు బయటికి రాకుండా ఉండడానికి చర్యలు తీసుకున్నామని.. దాని సమీక్ష కోసం ట్రంప్ ఫోటో బయటికి రాకుండా తొలగించామని అమెరికా న్యాయశాఖ అధికారులు పేర్కొన్నారు. అయితే ఇదంతా తాత్కాలికంగానే చేశామని.. ఈ కేసులో ఎవరైతే బాధితులుగా ఉన్నారో.. వారిని మాత్రమే తాము రక్షించడానికి దస్త్రాలలో సవరణలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఎవరి వైపు తాము పక్షపాతం ప్రదర్శించడం లేదని.. సమరూపకంతోనే వ్యవహరిస్తున్నామని వెల్లడించారు.

# ఆర్మీ అమ్ముల పొదిలోకి ఆత్మాహుతి డ్రోన్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

పహల్గాం ఉగ్రదాడి.. 26 మంది యాత్రీకుల కాల్చివేత.. తర్వాత భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో మన సైనిక శక్తి పాకిస్తాన్‌తోపాటు ప్రపంచ దేశాలకు తెలిసిపోయింది. భారత సైన్యం జరిపిన మెరుపు దాడి.. పాకిస్తాన్ డ్రోన్ దాడులను సమర్థవంతంగా ఎదుర్కొనడం చూపిన ప్రపంచ దేశాలు షాక్ అయ్యాయి. ఇదే సమయలో మనకు మిత్రులు ఎవరు.. శత్రువులు ఎవరు అన్నది నిర్ధారణ అయింది. దీంతో మనం మరింత సమర్థవంతంగా, శక్తివంతంగా కావాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ క్రమంలో కేంద్రం ఇప్పటికే ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా సరికొత్త ఆయుధాలు రూపొందిస్తోంది. విదేశాల నుంచి కూడా సరికొత్త టెక్నాలజీ ఆయుధాలు కొనుగోలు చేస్తోంది. తాజాగా 850 ఆత్మాహుతి డ్రోన్ల కొనుగోలు తుది దశకు చేరింది. డిసెంబర్ చివర్లో రక్షణ మంత్రిత్వ శాఖ సమావేశంలో ఆమోదం లభించనుంది. పహల్గాం దాడి తర్వాత అప్రమత్తత పెరిగిన సందర్భంలో, ఈ డ్రోన్లు ప్రాణనష్టం లేకుండా శత్రు లక్ష్యాలను నిర్మూలిస్తాయి. భవిష్యత్తులో 30 వేల డ్రోన్ల సమకూర్జన ప్రణాళికలో ఇది మొదటి దశ.నేషనల్ ఏరోస్పేస్ లేబొరేటరీస్ అభివృద్ధి చేసిన ఈ డ్రోన్లు 1,000 కి.మీ. దూరం ఎగురుతాయి. రాడార్‌లకు తప్పిపోయి లక్ష్యాలను ధ్వంసం చేస్తాయి. రష్యా?ఉక్రెయిన్ యుద్ధంలో ఇలాంటి ఆయుధాలు ప్రధాన పాత్ర పోషించాయి. రెండామూల ప్రపంచ యుద్ధంలో జపాన్ కామికాజే విమానాల్లా ఈ డ్రోన్లు పనిచేస్తాయి.పదాతి దళం ప్రతి ప్లాటూన్‌కు 10 డ్రోన్లతో 'అశనీ' దళాలు ఏర్పాటు చేయనుంది. గుంపుగా ప్రయోగిస్తూ కొన్ని నిఘా చేస్తూ, మిగతావి దాడి చేస్తాయి. పేలుడు పదార్థాలు మోసుకెళ్లి రాడార్‌లకు తప్పుకుని దాడి చేస్తాయి. అరుణాచల్ ప్రదేశ్‌లోని కమెంగ్ రంగంలో సైన్యం ప్రయోగాత్మక పరీక్షలు పూర్తి చేసింది. క్రమంగా వాయుసేన, నౌకాదళాల్లోకి తీసుకువస్తారు.ఏప్రిల్ 22 పహల్గాం దాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్ డ్రోన్లు ప్రయోగించింది. భారత్ వాటిని అడ్డుకున్నప్పటికీ, భవిష్యత్ ముప్పులను ఎదుర్కొనేందుకు డ్రోన్ శక్తి పెంచుకుంటోంది.

# జపాన్ సునామీ వాల్

టోక్యో, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

జపాన్ పేరు చెప్పగానే మనసులో మెరిసే అత్యాధునిక సాంకేతికతలతోపాటు, విపత్తుల ముందు చూపే అసాధారణ ధైర్యం కూడా గుర్తొస్తుంది. ఈ దేశం గతంలో భూకంపాలు, సునీమాలు, అగ్నిపర్వతాల బ్లాస్టింగ్ కారణంగా అపార నష్టం చవిచూసింది. అందుకే, భవిష్యత్ ముప్పులను అడ్డుకోవడానికి అసాధారణ



ప్రణాళికను అమలు చేసింది. సముద్రతీరాల్లో 395 కిలోమీటర్ల పొడవునా భారీ గోడ నిర్మించి, తమ ప్రాంతాలను మహా తరంగాల నుంచి కాపాడుకుంది.రక్షణ వ్యవస్థ కేవలం ఇంజనీరింగ్ అద్భుతం మాత్రమే కాదు, ప్రకృతి సహాయంతో ముడిపడిన సమగ్ర పరిష్కారం. గోడకు సమీపంలో 9 మిలియన్ల చెట్లను నాటి, దట్ట అడవిని సృష్టించారు. సముద్ర అలల ఉద్ధృతిని మొదట కాంక్రీట్ అడ్డుకుంటుంది, ఆ తర్వాత చెట్లు అదనపు స్థిరత్వం అందిస్తాయి. ఈ డ్యూయల్ సిస్టమ్ పర్యావరణాన్ని కాపాడుతూ, విపత్తు ప్రభావాన్ని తగ్గిస్తుంది.ఈ మోడల్ మానవులు, ప్రకృతి సమన్వయంతో విపత్తులను ఎదుర్కోవచ్చని నిరూపిస్తోంది. జపాన్ పట్టుదల, ముందుచూపు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఇలాంటి సజనాత్మక విధానాలు భవిష్యత్ రక్షణలో కీలకం. విపత్తులను ఎదుర్కోవడంలో జపాన్ వారి ప్రణాళిక మరియు పట్టుదల ప్రపంచానికే ఆదర్శం.

# కేసీఆర్‌ను నమ్మేదెలా

హైదరాబాద్, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):



బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ మళ్లీ యాక్టివ్ కానున్నారన్నది ఆ పార్టీ నేతలకే నమ్మకం కలగడం లేదు. ఎందుకంటే పార్టీ ఆవిర్భావ సభలో వరంగల్ లో ఇక జనంలోనే ఉంటానని చెప్పిన కేసీఆర్ నిన్నటి వరకూ బయటకు రాలేదు. ఇప్పుడు మరోసారి వచ్చి ఇదిగో వస్తున్నానంటే నమ్మడానికి పార్టీ నేతలు కానీ, కార్యకర్తలు కాని మానసికంగా సిద్ధంగా లేరు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో వరంగల్ లో జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో కూడా ఇలాగే ప్రకటన చేశారు. కానీ ఆవిర్భావ దినోత్సవాలు జరిగి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఫామ్ హౌస్ గడప దాటలేదు. వరంగల్ సభలో కూడా ఆవేశంగా ప్రకటించిన కేసీఆర్ తర్వాత అయితా పయితా లేరు. అదే విషయాన్ని ఇప్పుడు కార్యకర్తలు గుర్తుకు తెస్తున్నారు.దాదాపు చాలా రోజుల తర్వాత తెలంగాణ భవన్ కు వచ్చిన కేసీఆర్ పార్టీ నేతల సమావేశంలో ఆవేశంగా మాట్లాడారు. నల్లగొండ, మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని ఆదేశించారు. అయితే ఈ మూడు సభలకు కేసీఆర్ హాజరవుతారా? లేదా? అన్నది ఇప్పటికీ అందరికీ అనుమానమే. కానీ తాను వస్తానని చెప్పి అన్ని ఏర్పాట్లు చేయమంటారు. కానీ వచ్చేంత వరకూ నమ్మకం లేదన్నది బీఆర్ఎస్ నేతల నుంచి వినిపిస్తున్న మాట. అయితే ఇక కేసీఆర్ బయటకు రాకపోతే అసలుకే ఎసరు తప్పదన్న భయం నేతల్లో ఇప్పటికే నెలకొని ఉంది. ఇప్పటికే అన్ని ఎన్నికల్లో ఓటమి పాలయిన బీఆర్ఎస్ ఇక కేసీఆర్ బయటకు రాకపోతే మరింత క్యాడర్ నీరుగారిపోతుందని తెలుసు.బీఆర్ఎస్ వర స ఓటములతో పాటు కుమార్తె కల్వకుంట్ల కవిత ఇప్పటికే యాత్ర పేరిట జనంలోకి వెళుతున్నారు. సామాజికయాత్ర పేరుతో తెలంగాణలో పర్యటిస్తూ పార్టీ నేతలపైనే విమర్శలు చేయడాన్ని కనీసం కేసీఆర్ ఖండించకపోవడం కూడా విమర్శలకు దారి తీస్తుంది. శాసనసభ ఎన్నికల్లో ఓటమి పాలయి రెండేళ్లు దాటుతున్నప్పటికీ పార్టీ అధినేత కేసీఆర్ కార్యకర్తలను కలిసేందుకు ఇష్టపడకపోవడం కూడా పార్టీపై ఎఫెక్ట్ పడనుందని చెబుతున్నారు. కేసీఆర్ ఫాం హౌస్ వదిలి జనంలోకి రావాలని క్యాడర్ కోరుకుంటున్నారు. కానీ కేసీఆర్ ను చూస్తుంటే ఇప్పట్లో కదిలేలా కనిపించడం లేదు. మరి కేసీఆర్ మీడియా సమావేశంలో చెప్పినట్లు బయటకు వస్తారా? రారా? అన్న చర్చ పార్టీలో జరుగుతుంది.

పొన్నం కౌంటర్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మీడియా సమావేశంలో కూర్చుని తోలు తీస్తామంటే ఊరుకోబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే డీపీఆర్ వెనక్కు వచ్చిందని అన్నారు. నిజంగా నీటి పారుదల శాఖపై చర్చించాలంటే అసెంబ్లీ సమావేశాలకు రావాలని కోరారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై చర్చించడానికి తాము కూడా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు.ప్రజలు మీ తోలు తీసినా మీలో మార్పు రాలేదన్నారు. కేసీఆర్ పాతపురాణాన్ని వల్లె వేశారన్నారు. దద్దమ్మ పాలన చేసింది తాము కాదని,మీరేనని పొన్నం ప్రభాకర్ అన్నారు. మీ హయాంలో డీపీఆర్ వెనక్కు వచ్చినప్పుడు నిద్రపోతున్నారా? అని ప్రశ్నించారు. జగన్, మోదీతో అంటకాగినప్పుడు ఏమయిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఇప్పటికే మీ బిడ్డ కవిత నీ తోలు తీస్తుందని మండి పడ్డారు.

# డీ లిమిటేషన్ కు లైన్ క్లియర్

హైదరాబాద్, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను 300 డివిజన్లను పెంచడంపై దాఖలైన 80 పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టి వేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేమని తెలిపింది. అభ్యంతరాలు తెలిపేందుకు ఇచ్చిన గడువు ముగిసిందని హైకోర్టు గుర్తు చేసింది. దీంతో ప్రభుత్వం గ్రేటర్ ను 300 వార్డులుగా విభజించడానికి అడ్డంకులు తొలగిపోయినట్లయింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరిస్తూ, వార్డుల సంఖ్యను 150 నుండి 300కు పెంచుతూ ప్రభుత్వం డీలిమిటేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజన అశాస్త్రీయంగా ఉందంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. పిటిషన్లపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి, తొలుత 300 వార్డుల జనాభా వివరాలు, మ్యాప్‌లను 24 గంటల్లో పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని ఆదేశించారు. అయితే, దీనిపై ప్రభుత్వం అప్పీలుకు వెళ్లడంతో డివిజన్ బెంచ్ ఈ ఉత్తర్వులను పాక్షికంగా సవరించింది. కేవలం పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసిన వార్డులు ముఖ్యంగా వార్డు నెం. 104 - షా అలీ బండా, 134 - లంగర్ హౌజ్ వివరాలు మాత్రమే బహిర్గతం చేయాలని స్పష్టం చేసింది. వార్డుల విభజనపై ప్రజలు తమ అభ్యంతరాలను సమర్పించడానికి హైకోర్టు అదనపు సమయం కేటాయించింది. తొలుత డిసెంబర్ 17తో ముగియాల్సిన గడువును కోర్టు డిసెంబర్ 19 వరకు పొడిగించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ డీలిమిటేషన్ అనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇందులో కోర్టుల జోక్యం పరిమితంగా ఉండాలని వాదించారు. కేంద్ర సెన్సస్ కమిషనర్ ఆదేశాల ప్రకారం డిసెంబర్ 31, 2025 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని, అందుకే వేగంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ




చేశామని, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.డీలిమిటేషన్ పై ప్రభుత్వానికి చాలా అభ్యంతరాలు వచ్చాయి. ఒకే వార్డు రెండు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోకి వస్తోందని కొందరు ఫిర్యాదు చేశారు. కొన్ని వార్డుల్లో 18 వేల జనాభా ఉంటే, మరికొన్నింటిలో 70 వేల వరకు ఉండటంపై కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హయత్ నగర్ వంటి ప్రాంతాల్లో చారిత్రక కట్టడాలు ఒక వార్డులో, ఆ ప్రాంత పేరుతో ఉన్న మరో వార్డు వేరే చోట ఉండటంపై స్థానికులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు అభ్యంతరాలను స్వీకరిస్తూనే, మరోవైపు కోర్టు కోరిన వార్డుల మ్యాప్‌లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. డిసెంబర్ 31లోగా తుది నివేదిక సిద్ధం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దానికి సంబంధించి కోర్టు వద్ద అడ్డంకులు అన్నీ తొలగిపోయినట్లయింది.

# గ్రేటర్ హైదరాబాద్ వాసులకు గుడ్‌న్యూస్

హైదరాబాద్, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

హైదరాబాద్ నగర ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గించే దశగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిల్ కార్పొరేషన్ ఒక సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ బంపర ఆఫర్ ప్రకటించింది. నగరంలోని ప్రైవేటు, ప్రభుత్వం ఆస్తులకు సంబంధించి పేరుకుపోయిన పన్ను బకాయిలపై భారీ మినహాయింపులను కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 90 శాతం వడ్డీ మినహాయింపు: ఒకేసారి చెల్లింపుతో విముక్తి ఈ పథకం ప్రకారం ఆస్తి పన్ను బకాయి ఉన్న వినియోగదారులు తమ పెండింగ్ బకాయిలపై ఉన్న వడ్డీలో ఏకంగా 90 శాతం మినహాయింపును పొందవచ్చు. అంటే వినియోగదారులు తాము చెల్లించాల్సిన అసలు పన్నుతోపాటు కేవలం పది శాతం వడ్డీని మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఈ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానం ద్వారా వేల సంఖ్యలో ఉన్న పన్ను చెల్లింపుదారులకు గొప్ప ఉపశమనం లభించనుంది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని రాల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు ఈ రాయితీ వర్తిస్తుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. విస్తరించిన నగరానికి వర్తింపు: ఇటీవల గ్రేట్ హైదరాబాద్ పరిధిని ప్రభుత్వం భారీగా విస్తరించిన సంగతి తెలిసిందే. ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని ఉన్న 20 పురపాలక సంఘాలు, ఏడు నగరపాలక సంస్థలన జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఈ విలీన ప్రక్రియతో బృహత్ నగరంగా అవతరించిన హైదరాబాద్‌లో కొత్త ప్రాంతాలను కూడా ఈ ప్రాపర్టీ ట్యాక్స్ ఆఫర్ వర్తించనుంది. దీని వల్ల అటు ప్రజలకు వడ్డీ భారం తగ్గడమే కాకుండా ఇటు జీహెచ్ఎంసీకి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా నగర వాసులు తమ ఆస్తి పన్ను రికార్డులను క్లియర్ చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. అప్పుల భారం లేకుండా నవ నగర నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరుతున్నారు.

# మూడేళ్ల ముందు నుంచే టిక్కెట్ల లొల్లి

మహబూబ్ నగర్, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్ బీఆర్ఎస్‌లో వర్గ విభేదాలు పీక్ లెవల్‌కు చేరాయి. కారు పార్టీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరుతో క్యాడర్ రెండుగా చీలిపోయిందన్న టాక్ వినిపిస్తోంది. షాద్ నగర్ నియోజకవర్గంలో 2014, 2018లో రెండు సార్లు ఘన విజయం సాధించిన గులాబీ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైంది. గత రెండేళ్లుగా పార్టీ వర్గ విభేదాలతో కొట్టుమిట్టాడుతోంది. బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు, మహబూబ్ నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ఏ మాత్రం పొసగడం లేదు. అంజయ్య యాదవ్, నవీన్ రెండు వర్గాలుగా విడిపోవడంతో ద్వితీయస్థాయి నేతలతో పాటు కార్యకర్తలు అయోమయంలో పడ్డారట. అధికార పార్టీ మీద పోరాడాల్సింది పోయి..సొంత పార్టీలో ఈ కుంపటి ఏంటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారట గులాబీ పార్టీ కార్యకర్తలుమాజీ ఎమ్మెల్యే అంజయ యాదవ్ ఈ సారి తన కుమారుడికి టికెట్ ఇప్పించుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కూడా వచ్చే ఎన్నికల్లో షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ట్రై చేస్తున్నారట. నవీన్ రెడ్డి ఎమ్మెల్యే సీటుపై కన్నేయడంతో తమ సీటుకు ఎసరు వస్తుందన్న ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వర్గం అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారట. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నవీన్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ తరఫున స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా గెలవడంతో ఆయనపై బీఆర్ఎస్ అధిష్టానానికి మంచి అభిప్రాయం ఉండటంతో పాటు ఆర్థికంగా రాజకీయంగా అన్ని విధాల నవీన్ కుమార్ బలంగా ఉండటంతో స్పీడు పెంచారు. ఇదే ఇప్పుడు అంజయ్య యాదవ్ వర్గంలో ఆందోళనకు కారణమవుతోందని తెలుస్తోంది.ఎమ్మెల్సీ హోదాలో ఉన్న నవీన్ రెడ్డి..హైదరాబాద్‌లోని పార్టీ ఆఫీస్ మొదలుకొని షాద్‌నగర్ వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ ప్రజల దృష్టిలో, అధిష్టానం దృష్టిలో పడే ప్రయత్నం చేస్తున్నారట. అంతేకాదు బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలకు షాద్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలను తరలించడంతో..కేటీఆర్ కూడా నవీన్ రెడ్డిని అభినందించారట. ఇది మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వర్గానికి ఏ మాత్రం రుచించడం లేదంటున్నారు. అప్పటి నుంచి ఇరు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోదన్న టాక్ వినిపిస్తోంది.లేటెస్ట్‌గా జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ ఓ వైపు అంజయ్య యాదవ్, మరోవైపు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఎవరికి వారు సెపరేట్‌గా.. తమ వర్గానికి చెందిన అభ్యర్థులను బరిలోకి దింపి చాలా వరకు గెలిపించుకున్నారు. అయితే అంజయ్య యాదవ్, నవీన్ రెడ్డి వర్గ పోరు పార్టీకి డ్యామేజ్ చేస్తుందన్న ఆందోళన క్యాడర్ కనిపిస్తోందట. ఇంకా కొన్ని పంచాయితీల్లో గెలవాల్సి ఉన్నా అంజయ్య యాదవ్, నవీన్ రెడ్డి విభేదాలతో అధికార కాంగ్రెస్‌కు మేలు జరిగిందని అంటున్నారు. ఇక షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ మద్దతుదారులుగా బరిలో నిలిచి గెలిచిన సర్పంచ్‌లను తెలంగాణ భవన్‌లో సన్మానించారు కేటీఆర్.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరు కాలేదు.

అంతే కాకుండా ఈ సమావేశంలో అంజయ్య యాదవ్ మళ్లీ భారీ మెజార్టీతో గెలుస్తారని కేటీఆర్ చెప్పడంతో మళ్లీ ఆయనకే టికెట్ అని చెప్పకనే చెప్పారన్న చర్చ మొదలైంది. ఇంకా ఎన్నికలకు మూడేళ్ల సమయం ఉండగానే..మాజీ ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ టికెట్ ఫైట్ ఇంట్రెస్టింగ్‌గా మారింది. అప్పటి వరకు పరిస్థితుల్లో మార్పు వచ్చి తనకే టికెట్ వస్తుందన్న ధీమాతో నవీన్ రెడ్డి ఉంటే..అధిష్టానం ఆశీస్సులు తనకే ఉన్నాయని అంజయ్య యాదవ్ చెప్పుకుంటున్నారట. మొత్తానికి షాద్‌నగర్ నియోజక వర్గంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వర్గాల మధ్య కార్యకర్తలు నలిగిపోవాల్సి వస్తుందట. మాజీ ఎమ్మెల్యే వెంట నడవాలో..ఎమ్మెల్సీ చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొనాలో తెలియక గులాబీ పార్టీ కార్యకర్తలు సతమతం అవుతున్నారని అంటున్నారు.

# వైకుంఠ ఏకాదశికి పకడ్బందీ ఏర్పాట్లు

తిరుమల డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఆగమోక్తంగా నిర్వహించాం . వైకుంఠ ఏకాదశి రద్దీని దృష్టిలో



ఉంచుకుని పకడ్బందీ ఏర్పాట్లు

చేస్తున్నామని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘల్ అన్నారు. ఆన్లైన్ లక్కీ డిప్ ద్వారా టికెట్లు పొందిన 1.89 లక్షల మందికి మాత్రమే వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి రోజుల్లో దర్శనం వుంటుంది. టికెట్లు ఉన్న భక్తులు వారికి కేటాయించిన సమయానికే రావాలి. క్యూలైన్లలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా 2 గంటల్లోనే దర్శనం పూర్తయ్యేలా ప్రణాళిక. జనవరి 2 నుంచి 8 వరకు (మిగిలిన 7 రోజులు) సామాన్య భక్తులకు సర్వదర్శన అనుమతి వుంటుందని అన్నారు. 4వ రోజు నుంచి 10వ రోజు వరకు రోజుకు 15 వేల ఎస్ఎస్డి (సూఆ) టోకెన్లు, 1,500 శ్రీవాణి టోకెన్లు ఆన్లైన్లో విడుదల చేస్తాం. చివరి 3 రోజులు తిరుపతి స్థానికుల కోసం రోజుకు 5,000 చొప్పున ప్రత్యేక టోకెన్ల కేటాయింపు జరుగుతుంది. వైకుంఠ ద్వారా దర్శనం కోసం అధిక రద్దీ ఉంటుంది. చంటిపిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు తిరుమల యాత్ర వాయిదా వేసుకోవాలి. జనవరి 8 తర్వాతే రావాలని టీటీడీ సూచన. భక్తుల భద్రత కోసం 3,500 మంది పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది మరియు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతర పర్యవేక్షణ వుంటుంది. క్యూలైన్లలోని భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేసామని అన్నారు. .

# 29 నుంచి అసెంబ్లీ

హైదరాబాద్, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

అసెంబ్లీ సమావేశాలు ఈనెల 29 నుంచి మొదలు కానున్నాయి. సమావేశాల్లో కృష్ణా, గోదావరి జలాల అంశమే ప్రధాన అజెండా కావాలి. అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ హయాంలో జరిగిన అన్యాయాన్ని ఎండగడదాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాల కారణంగా సాగు జలాల విషయంలో తెలంగాణ కోల్పోయిన హక్కులను ప్రజలకు తెలియజేద్దాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అవసరమైతే సభలోనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని అభిప్రాయపడ్డారు.పాలమూరు - రంగారెడ్డి ఎత్తుపోతల ప్రాజెక్టుపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం ఆయన మంత్రులతో సమావేశమయ్యారు. ఇటీవలి సర్పం చ్ ఎన్నికలు, వచ్చే ప్రాదేశిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, పీఏసీఎస్ ఎన్నికలు, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల షెడ్యూల్‌తోపాటు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.దాదాపు మూడున్నర గంటల పాటు అనేక అంశాలపై చర్చ సాగింది. తెలంగాణ అనుమతి లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్కడ నిర్మిస్తున్న ప్రాజెక్టులను అడ్డుకునే కార్యాచరణపై సీఎం చర్చించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్లే కృష్ణా నీటి వాటాలో అన్యాయం జరిగిందని, ఇదే విషయాన్ని సభ వేదికగా ప్రజలకు పూర్తిగా వివరించాలనే నిర్ణయం తీసుకున్నారు. పంచాయతీ ఎన్నికలు మంచి ఫలితాలనే ఇచ్చాయని, కొన్ని పొరపాట్లు వల్ల స్థానాలు తగ్గాయని సీఎం అభిప్రాయపడినట్లు తెలిసింది.వచ్చే ప్రాదేశిక ఎన్నికల్లో ఆ పొరపాట్లకు తావు లేకుండా చూసేందుకు ఎత్తుగడలు రూపొందించేందుకు సిద్ధమయ్యారని సమాచారం. పంచాయతీ ఫలితాలపై మంత్రులకు ర్యాంకులు ఇచ్చినట్లుగా తెలిసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులదే బాధ్యత తీసుకోవాలని సీఎం సూచించినట్లుగా తెలిసింది. మండల పరిషత్‌లతో పాట్లు జడ్పీ పీఠాలను క్లీన్ స్వీప్ చేయాలని సీఎం పిలుపునిచ్చినట్లు సమాచారం.జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనం.. డివిజన్ల ఏర్పాటుపై తీసుకున్న నిర్ణయాలు, నిబంధనలు మంత్రులకు సీఎం వివరించారు

# పావు వంతు లెక్చరర్లతో చదువు సాగేదెలా...

హైదరాబాద్, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల పరిస్థితి దారుణంగా తయారైంది. సరిపడ బోధనా సిబ్బంది లేక సర్కారు కాలేజీల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఉన్నత విద్యను ప్రభుత్వం పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఖాళీ అవుతున్న పోస్టులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు భర్తీ చేయకపోవడంతో డిగ్రీ కాలేజీల్లో బోధించే అధ్యాపకుల సంఖ్య ప్రతి ఏటా తగ్గిపోతోంది.రెగ్యులర్ అధ్యాపకులను నియమించకుండా వారి స్థానంలో గెస్ట్, కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించుకొని నెట్టుకొస్తున్నారు. కాలేజీల్లో సరి పడా సిబ్బంది లేకపోవడంతో తమ పిల్లలను ఆ కాలేజీల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు పెద్దగా సుముఖత చూపించడంలేదు. డిగ్రీ కాలేజీల్లోని కీలక పోస్టులైన ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 149 డిగ్రీ కాలేజీలుంటే, వీటిలో 4,520 పోస్టులకు పనిచేస్తున్నది మాత్రం కేవలం 1,695 మందే. 2,825 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇందులోనూ 2,570 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండడం గమనార్హం. ఈ 2,570 పోస్టుల్లో 50 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా, మరో 50 శాతం జూనియర్ లెక్చరర్లను ప్రమోషన్ల ద్వారా భర్తీచేస్తారు. అంతేకాకుండా 145 ప్రిన్సిపాల్ పోస్టులకు గానూ ప్రస్తుతం పని చేస్తున్నది కేవలం 84 మందే.మిగతా పోస్టులు ఖాళీనే. ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు 133 ఉంటే కేవలం 23 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా 110 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థులను ఆటలు ఆడించే పరిస్థితే లేదు. లైబ్రేరియన్ పోస్టులు 133 ఉంటే, ఏకంగా 90 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పనిచేస్తున్నది 43 మంది మాత్రమే. ఇలా ప్రధాన పోస్టుల్లో సిబ్బంది లేక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు కునారిల్లుతున్నాయి. ఉన్నవారినే ఇన్‌చార్జిలుగా పెట్టి కళాశాలలను నెట్టుకొస్తున్న పరిస్థితి ఉంది. సరిపడ అధ్యాపకులు కాలేజీల్లో లేకపోవడంతో అడ్మిషన్లు తీసుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఇష్టపడంలేదు. పేరున్న మంచి కాలేజీల్లో సీట్లు నిండితున్నా మిగతా కాలేజీల్లో అయితే నిండడం కష్టంగానే మారింది. ఈ ఏడాది కాలేజీల్లో సీట్లు అంతంత మాత్రంగానే నిండాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో దాదాపు 90 వేల సీట్లుంటే 51 వేల అడ్మిషన్లు మాత్రమే నిండాయి.సిబ్బంది కొరత, సరైన వసతుల్లేకపోవడంతో ఇంటర్ తర్వాత చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లోనే చేరుతున్నారు.

# పేకాట క్లబ్ పై దాడి 32 లక్షల స్వాధీనం

ఏలూరు డిసెంబర్ 23, నూజివీడు నియోజకవర్గం లోని పోతవరప్పాడు లోని మ్యాంగో రిక్రియేషన్ క్లబ్ లో ఆదివారం రాత్రి పోలీసులు రైడ్ చేశారు ఆ సమయంలో పేకాటాడుతున్న వారిని అదుపులోకి తీసుకుని 135 కార్లను సీజ్ చేసి రవాణా శాఖ అధికారులతో చెక్ రిపోర్ట్ రాయించి, సుమారు 32 లక్షల రూపాయలు నగదు కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు.అందులో భాగంగా గత రాత్రి మ్యాంగో మాంగో బే రిక్రియేషన్ క్లబ్లో పోలీసులు జరిపిన దాడిలో పట్టుబడ్డ 281 మంది పేకాట రాయుళ్లను నూజివీడు కోర్టులో సోమవారం అర్ధరాత్రి 12 గంటల 30 నిమిషాలకు పోలీసులు హాజరు పరిచారు.మొత్తం 7 బస్సులలో పేకాట రాయుళ్లను నూజివీడు కోర్టుకు తరలించగా నూజివీడు కోర్టు వద్ద హై టెన్షన్ వాతావరణం చోటుచేసుకుంది తమ బంధువులను,నాయకులను విడిపించడానికి భారీగా చేరుకున్న సదరు పేకాట రాయుళ్లకు సంబంధించిన వ్యక్తులు పోలీసులతో వాగ్వివాదానికి దిగి ఉగ్రవాదులను తీసుకు వెళ్తున్నట్లు తీసుకువెళ్తున్నారని ధ్వజమెత్తారు.నూజివీడు పట్టణ సీఐ సత్య శ్రీనివాస్, రూరల్ ఎస్సై జ్యోతి బస్సు వాగ్వివాదానికి దిగుతున్న బంధువులను అక్కడ నుండి పంపించి ఎటువంటి గొడవ జరగకుండా ప్రశాంత వాతావరణం తీసుకువచ్చారు.కోర్టులో రెండు గంటల పాటు వాగ్వివాదాలు నిన్న అనంతరం న్యాయమూర్తి అర్ధరాత్రి రెండు గంటలకు వారికి బెయిల్ మంజూరు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో పెద్ద పులి మృతి

మాచర్ల డిసెంబర్ 23, పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో విషాద ఘటన చోటు చేసుకుంది. వెల్దుర్తి మండలం సిరిగిరిపాడు గ్రామ శివారులోని జాతీయ రహదారి 5 పై తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒక పెద్దపులి మృతి చెందింది. సమాచారం అందుకున్న వెంటనే అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా విజయపురి సౌత్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుజాత మాట్లాడుతూ విజయపురి సౌత్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో మొత్తం నాలుగు పెద్దపులులు ఉన్నాయని, అందులో ఒక పులి తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృత్యువాత పడిందని తెలిపారు.

# కేసీఆర్ గేర్ మార్చారా...

## పాలమూరు జిల్లా టార్గెట్..



హైదరాబాద్, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

రేవంత్ పేరును ప్రస్తావించకుండానే..గట్టిగానే అటాక్ చేశారు కేసీఆర్. రేవంత్ సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్‌కు చెందిన కృష్ణా జలాల వాటా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను సెంట్రిక్‌గా కేసీఆర్ ఇండైరెక్ట్‌గా రేవంత్ రెడ్డిపై సీరియస్ కామెంట్స్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల డీపీఆర్‌ను కేంద్రం వెనక్కి పంపితే నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారంటూ ఫైరయ్యారు. డీపీఆర్ను వెనక్కి పంపితే భూమి, ఆకాశాన్ని ఏకం చేసి లొల్లి చేయాల్సింది పోయి ప్రభుత్వం సైలెంట్‌గా ఉందని పరోక్షంగా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేశారు కేసీఆర్.పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో గ్రామగ్రామాన సభలు పెట్టి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎండగట్టి తీరుతామ్. పెద్ద ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామ్. బహిరంగ సభలకు తాను స్వయంగా హాజరవుతానంటూ..ఇక పూర్తిస్థాయిలో రంగంలోకి దిగుతానని చెప్పకనే చెప్పారు గులాబీ బాస్. ఎంతసేపు రియల్ ఎస్టేట్ దందాలే తప్ప.. వేరే ధ్యాసే లేదని రేవంత్ రెడ్డి సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎక్కడికక్కడ నిలదీస్తామని..అన్యాయాలపై ప్రశ్నిస్తామని హెచ్చరించారు.అయితే ఎక్కడా కేసీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరును పలకలేదు. రేవంత్ పేరును ప్రస్తావించకుండానే ఓ రేంజ్‌లో విమర్శలు, ఆరోపణలు చేయడం మరోసారి సమ్‌థింగ్ స్పెషల్‌గా మారింది. ఆఖరికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేరును పలికిన కేసీఆర్, రేవంత్ రెడ్డి పేరును మాత్రం పలకకపోవడం ఆసక్తికరంగా మారింది. రేవంత్ పేరును తీయకుండానే ఆయనపై కేసీఆర్ యుద్ధం ప్రకటించారన్న చర్చ సాగుతోంది.ఇక సీఎం రేవంత్ రెడ్డి యాజ్ టీజ్‌గా మాజీ సీఎం కేసీఆర్‌ను నేరుగా టార్గెట్ చేశారు. పదేళ్ల పాలనలో తెలంగాణను 8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన కేసీఆర్ ఒక ఆర్థిక ఉగ్రవాది అంటూ మండిపడ్డారు. కలుగులో దాక్కున్న ఎలుకలా ఇన్నాళ్లూ మౌనంగా ఉండి.. ఇప్పుడు బయటకు వచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దమ్ముంటే జనవరి 2న జరిగే అసెంబ్లీ సమావేశాలకు రావాలని..తెలంగాణకు ఎవరు మేలు చేశారో అక్కడే తేల్చుకుందామంటూ సవాల్ చేశారు రేవంత్.పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా కేసీఆర్ తీరు మారలేదని..కమిషన్ల కోసమే రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారంటూ దుమ్మెత్తిపోశారు. అయితే రేవంత్ రెడ్డి పేరు తీయకుండా కేసీఆర్ సీఎం సొంత జిల్లాలోని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణాజలాల అంశాలను బేస్ చేసుకుని టార్గెట్ చేస్తే, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం యథావిధిగా కేసీఆర్‌ను టార్గెట్ చేయడం చర్చకు దారితీస్తోంది. ఇక ఇప్పుడు కేసీఆర్ యాక్టీవ్ కాబోతుండటంతో తెలంగాణలో ఇకపై రాజకీయం రంజుగా ఉంటుందన్న టాక్ వినిపిస్తోంది.

### టార్గెట్ సాగునీటి ప్రాజెక్టులు

గులాబీ అధినేత కేసిఆర్ మొత్తానికి ఫామ్హౌస్ నుంచి బయటికి వచ్చారు. శనివారం రాత్రి హైదరాబాదులోని నంది నగర్ లో తన నివాసానికి వచ్చారు. చాలా రోజుల తర్వాత కెసిఆర్ బయటికి రావడంతో తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో సంచలనం నెలకొంది. కెసిఆర్ ఇప్పటికిప్పుడు బయటకు రావడం వెనుక బలమైన కారణం ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కేసీఆర్ బయటకు కనిపించడం అత్యంత అరుదుగా మారింది. పార్లమెంటు ఎన్నికల్లో ప్రచారం తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రానికి పరిమితమైపోయారు. గులాబీ పార్టీ పాతిక సంవత్సరాల పండుగకు ఆయన వరంగల్ నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఆ తర్వాత ఓ టీవీ ఛానల్ నిర్వహించిన ఇంటర్వ్యూకు కూడా హాజరయ్యారు. ఇటీవల తన మేనల్లుడు హరీష్ రావు తండ్రి చనిపోతే కేసీఆర్ బయటికి వచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో స్టార్ క్యాంపైనర్ గా కెసిఆర్ పేరు పేర్కొన్నప్పటికీ.. ఆయన బయటికి రాలేదు.తనను కలిసే నేతలతో మాత్రమే కేసీఆర్ మాట్లాడుతున్నారు. కేటీఆర్, హరీష్ రావు తో అప్పుడప్పుడు సమావేశం అవుతున్నారు.. ఎన్నికల్లో, వివిధ సందర్భాలలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాల గురించి మాత్రమే ఆయన మాట్లాడుతున్నారు. అయితే ఇన్ని రోజుల తర్వాత కెసిఆర్ బయటికి వచ్చారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులపై ప్రధానమైన చర్చ జరుగుతుందని సమాచారం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల పోలవరం నల్లమల సాగర్ నిర్మాణాన్ని ప్రతిపాదించింది. దీనిపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపాదించిన పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుపై కూడా చర్చ జరుగుతుందని తెలుస్తోంది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు 45 టీఎంసీల కృష్ణా నీటితో సర్దుకుపోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన తీరును గులాబీ పార్టీ తప్పుపడుతోంది. తాము అధికారంలో ఉన్నప్పుడు 90 టీఎంసీల నీటి కోసం పోరాటం చేసామని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 45 టీఎంసీలకు ఇలా ఒప్పుకుంటుందని గులాబీ పార్టీ ప్రశ్నిస్తోంది. ఈ వ్యవహారంపై ఉద్యమ కార్యాచరణ రూపొందించాలని గులాబీ అధినేత భావించినట్టు సమాచారం. ఉద్యమ కార్యాచరణకు సంబంధించి తేదీలను మాత్రం ప్రకటించకపోవచ్చని.. ఎందుకంటే త్వరలో స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికలు జరగబోతున్నాయని.. అందువల్లే పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.. చాలాకాలం తర్వాత కెసిఆర్ బయటికి వచ్చిన నేపథ్యంలో రేవంత్ రెడ్డికి సవాళ్లు విసిరే అవకాశం లేకపోలేదని? మరి దీనిని ముఖ్యమంత్రి ఎలా స్వీకరిస్తారో చూడాల్సి ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# డుమ్మా టీచర్లకు రేవంత్ షాక్

## 50 మంది తొలగింపు



హైదరాబాద్, డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నానాటికీ దిగజారుతుంది. ఇప్పటికే ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ బడులు తెలంగాణలోనే అధికంగా ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. మరోవైపు సర్కార్ బడుల్లో విధులు నిర్వహించే కొందరు టీచర్లు వేళాపాళా లేకుండా ఇష్టారీతిన సెలవులు పెట్టడంపై రేవంత్ సర్కార్ కీలక చర్యలకు ఉపక్రమించింది. ఇకపై టీచర్లు చెప్పా పెట్టకుండా విధులకు నెల రోజులపాటు వరుసగా గైర్హాజరైతే వారి ఉద్యోగం శాశ్వతంగా తొలగించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ప్రకటన జారీ చేశారు. సర్కార్ బడుల్లోని ఎఫ్ఆర్ఎస్, మధ్యాహ్న భోజనం అమలు వంటి విషయాలపై డీఈఓలతో తాజాగా ఆన్‌లైన్‌లో సమీక్షించారు.ఎఫ్ఆర్ఎస్ ద్వారా ఏయే స్కూళ్లలో ఉపాధ్యాయుల హాజరు ఎంత శాతం ఉందో తెలుసుకునే వెసులుబాటు ఉంది. ఈ వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నందున వాటిపై డీఈవోలు తరచూ సమీక్షించాలని విద్యాశాఖ ఆదేశించింది. ఉపాధ్యాయులు నెలరోజులపాటు ఎలాంటి అనుమతి లేకుండా విధులకు హాజరు కాకుంటే షోకాజ్ నోటీసు జారీ చేయాలని, విచారణలో రుజువైతే ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు గెజిట్‌లో ప్రచురించాలని డీఈఓలకు సూచించారు. ఒక రోజు అనధికారికంగా స్కూల్‌కి రాకున్నా ఇదే విధంగా చర్యలు తీసుకోవచ్చు. అయితే అకస్మాత్తు అనారోగ్యం, రోడ్డు ప్రమాదం వంటి సాకులతో కోర్టుల్లో కేసులు వేసే అవకాశం ఉన్నందున నెల రోజులు అనధికారిక సెలవు పెడితే షోకాజ్ నోటీసులు ఇవ్వాలని తెలిపారుకాగా గత ఆగస్టు నుంచి ఎఫ్ఆర్ఎస్ అమల్లోకి రావడంతో టీచర్లు వచ్చిన, వెళ్లిన సమయం నమోదవుతోంది. అయితే టీచర్స్ టైమింగ్స్‌పై అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. కేవలం విధులకు హాజరయ్యారా? లేదా? అన్నదే పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఇకపై టీచర్ల ఆలస్యంపై కూడా దృష్టి సారిస్తామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు యేటా కొందరు టీచర్లు దీర్ఘకాలిక సెలవులపై వెళ్తుంటారు. 6 నెలలని అనుమతి తీసుకొని రెండేళ్లైనా విధులకు రావడం లేదు. అలాంటి వారిని గత రెండేళ్లలో సుమారు 50 మందిని ఉద్యోగాల నుంచి తొలగించినట్లు విద్యాశాఖ తెలిపింది. కనీసం సెలవులను పొడిగించుకుంటామని కూడా సమాచారం ఇవ్వడం లేదని, ఇలా దీర్ఘకాలికంగా విధులకు హాజరు కానివారిని కూడా తొలగించాలని సూచించారు. కాగా ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 24 వేల పాఠశాలల్లో సుమారు 1.15 లక్షల మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు

============

# మధురానగర్ నూతన సర్పంచ్ కు ఆర్యవైశ్య నాయకుల సత్కారం

చొప్పదండి ని.వ. (గంగాధర మండలం) డిసెంబర్ 23,

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఘనవిజయం సాధించి నూతన గ్రామపంచాయతీ సర్పంచ్ గా ప్రమాణస్వీకారం చేసిన వేముల భాస్కర్ కు మధురానగర్ ఆర్యవైశ్య సంఘం ఆద్వర్యంలో మంగళవారం శాలువాతో సత్కారం చేసారు. ఈ సత్కార కార్యక్రమంలో మధురానగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పడకండి సంతోష్, ప్రధాన కార్యదర్శి నాళ్ళ రామ్, ఉపాధ్యక్షులు రేగురి అభిలాష్, బొడ్ల లక్ష్మీకాంతం,ముఖ్య సలహాదారుడు నలుమాచు హరికిషన్(రిపోర్టర్), బిక్కుమల్ల నాగరాజు, కోశాధికారి బొడ్ల శ్రీనివాస్, సభ్యులు గుండ సందీప్(మహేశ్వర మెడికల్ షాప్ మధురానగర్ చౌరస్తా), మధురానగర్ ఆర్యవైశ్య సబ్యులు పాల్గొన్నారు.



# విద్యార్థులతో విద్యార్థిని కొట్టించిన టీచర్లు



కుత్బుల్లాపూర్ ఏడో తరగతి విద్యార్థిపై అదే స్కూల్లో చదువుతున్న విద్యార్థులతో దాడి చేయించిన సంఘటన పేట్బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కొంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో శివరామకృష్ణ కుమారుడు సూర్య 7వ తరగతి చదువుతు న్నాడు. అతన్ని విద్యార్థులు పార్కు చేసిన సైకిళ్ల వద్దకు వెళ్లి చూసి రమ్మని ఉపాధ్యాయుడు మధు చెప్పడంతో చూసొచ్చాడు. అయితే సూర్య సైకిళ్ల వద్దకు వెళ్లి వస్తున్నాడని మరో ఉపాధ్యాయుడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, దుండిగల్ మండల ఎంఈవో కృష్ణ వద్దకు తీసుకెళ్లాడు. ఆయన ఆగ్రహించి 10వ తరగతి విద్యా ర్థులను పిలిచి బాలుడి వీపుపై కొట్టాలని ఆదేశించారు. దీంతో వారు రెచ్చిపోయి కర్రతో విపరీతంగా దాడి చేశారు. ఈ విషయం బయట చెబితే పాఠశాల నుంచి టీసీ ఇచ్చి పంపిస్తానని హెచ్‌ఎం బెదిరించాడు. దెబ్బలు తట్టుకోలేక సూర్య రాత్రి నీరసంగా ఉండటంతో తల్లిదం డ్రులు గుర్తించి ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. ఈ విషయమై పాఠ శాల ప్రధానోపాధ్యాయులు కృష్ణను సంప్రదించగా తానే విద్యార్థులను పిలిపించి కొట్టుమని చెప్పా నని, కానీ అంత పెద్దగా కొడతారని అనుకోలేదని ప్రిన్సిపాల్ నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చాడు.

# మల్లేష్ కు కుల్చిన చోటే బెషరుతుగా షాపు నిర్మాణం చేసి ఇవ్వాలి.

## చిరు వ్యాపారులకు నష్టపరిహారం చెల్లించి దుకాణాలు ఉచితంగా ఇవ్వాలి.

## న్యాయం జరుగాకపోతే మున్సిపల్ ముట్టడి

## రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్.

గోదావరిఖని డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

:సుందరీకరణ అభివృద్ధి పేరిట దుకణాలు కులగొడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో విధ్వంసం సృష్టిస్తున్నారు కాంగ్రెస్ పాలకులు... గతంలో ఓనర్లు ఉన్నవారిని కిరాయిదారులు మార్చుతున్నారు... అభివృద్ధి సాకుతో ఓ పెద కుటుంబాన్ని రోడ్డుమీద పడేసారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తలో అక్రమంగా కుల్చివేసిన ఆకుల మల్లేష్ తిరిగి షాపు నిర్మాణం చేసి ఇవ్వాలని గతంలో కుల్చివేసిన చిరు వ్యాపారులకు నష్టపరిహారం అందించి దుకణాలు నిర్మాణం చేసి ఉచితంగా అందించాలని దినికి పూర్తి భాద్యత స్దానిక ఎమ్మెల్యే తీసుకోవాలని రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ గారు డిమాండ్ చేశారు. మంగళవారం అక్రమ కుల్చివేతలకు నిరసనగా బీ.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్దానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు . కుల్చివేత బాధితులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ మున్సిపల్ కమీషనర్ కు వినతి పత్రం అందించారు.రామగుండం లో ప్రజా వ్యతిరేక దుర్మార్గపు పాలన సాగుతుందని కమిషన్ల కోసమే కుల్చడం జరుగుతుందన్నారు. గత రెండు సంవత్సరాల కాలంగా అభివృద్ధి సుందరీకరణ సాకుతో రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని కుల్చివేతలతో నాశనం చేశారన్నారు. ఒక పెద కుటుంబానికి చెందిన ఆకుల మల్లేష్ లలిత దంపతులకు చెందిన షాపును మున్సిపల్ వారు చెప్పినవిధంగా సెట్ బ్యాక్ తీసుకోవాలని చెబుతే అధే విధంగా సెట్ బ్యాక్ తీసుకుని మిగిలిన కట్టడాన్ని ఉంచింతే కాంగ్రెస్ నాయకులు విజయ్ వచ్చి ఎమ్మెల్యే మాట్లాడుతున్నాడని ఆకుల లలిత తో మాట్లాడమని చెప్పి అదే రోజు అర్ధరాత్రి మల్లేష్ షాపును కుల్చడం దుర్మార్గం అన్నారు. మల్లేష్ షాప్ కు పర్మిషన్ ఉన్నా ఎందుకు కుల్చారని ప్రశ్నించారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కుల్చివేసిన చిరు వ్యాపారులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# కలెక్టరేట్ లో నారి న్యాయ్ కార్యక్రమం

## పాల్గొన్న మహిళా కమిషన్ చైర్ పర్సన్ శారద

హైదరాబాద్ డిసెంబర్ 23(భారతశక్తి ప్రతినిధి):

హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో మహిళా కమిషన్ ఆధ్వర్యంలో "నారి న్యాయ్" కార్యక్రమం నిర్వహించారు. మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ళ శారద ఆధ్వర్యంలో నారి న్యాయ్" కార్యక్రమం ఏర్పాటు చేశారు. వివిధ రకాల కేసులకు పరిష్కరించడానికి ఈ కార్యక్రమంలో సంబంధించిన అధికారులు అందరూ పాల్గొన్నారు. ఇంతకుముందు నమోదైన కేసులతోపాటు, వాకింగ్ కేసులకు సంబంధించిన వారు కూడా హాజరయ్యారు. మహిళల యొక్క ఆవేదన వారికి కావలసిన న్యాయం జరగాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ప్రతి జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి వారి యొక్క సమస్యలను పరిష్కరించే దిశలో వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ శారద.మహిళల సమస్యలు, పెండింగ్ లో ఉన్న ఫిర్యాదుల గురించి నేరుగా పిటిషనర్ల నుండి అర్జీలు స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను వివిధ పోలీస్ స్టేషన్ అధికారుల ద్వారా వెరిఫై చేసి రిపోర్టు రేపు మహిళా కమిషన్ కు తెలియజేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎక్కువ శాతం విడాకుల కేసులు ఉన్నాయని తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు,మహిళా కమిషన్ కార్యదర్శి, హైదరాబాద్ జిల్లా డి.డబ్ల్యూ.ఓ, సిడిపిఓలు, ఎస్.హెచ్.ఓ లు...వివిధ డిపార్ట్ మెంట్ ల అధికారులు పాల్గొన్నారు...

# శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుంది

## – జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
## – వార్షిక నేర గణాంక నివేదిక 2025

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 23 :

సమాజంలో శాంతి, భద్రతలను నెలకొల్పడంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తూ, ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నదని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశ్యంతో, సైబర్ నేరాలు, పోక్సో చట్టాలు, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి అంశాలపై కమ్యూనిటీ పోలిసింగ్ మరియు సోషల్ మీడియా ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.

నేరాల స్థితిగతులు :

2025 సంవత్సరంలో జిల్లాలో మొత్తం 8,255 కేసులు నమోదు కాగా, గత ఏడాదితో పోలిస్తే 1 శాతం తగ్గదల నమోదైందన్నారు. గ్రేవ్ కేసులు 28 శాతం తగ్గడం జిల్లా పోలీసుల సమర్థవంతమైన చర్యలకు నిదర్శనమని పేర్కొన్నారు.

లిహత్యలు %-% అత్యాచారాలు :

- హత్యలు 32% తగ్గాయి
-ఆస్తి కోసం హత్యలు 19% తగ్గాయి
- అత్యాచార కేసులు 21% తగ్గాయి
- అపహరణ కేసులు 39% పెరిగినట్లు తెలిపారు

మహిళల భద్రత

జిల్లా వ్యాప్తంగా 4 సబ్ డివిజన్లలో షీ-టీం బృందాలు ఏర్పాటు చేసి నిరంతర గస్తీ నిర్వహిస్తున్నామని,

207 పోక్సో కేసుల్లో బాధితులకు కౌన్సిలింగ్, మెడికో-లీగల్ సేవలు, షెల్టర్ మరియు రూ.45.15 లక్షల నష్టపరిహారం అందించడం జరిగిందన్నారు.

-మాదకద్రవ్యాల నియంత్రణ :

నార్కోటిక్ అనాలసిస్ బ్రాంచ్ మరియు స్పెషల్ టాస్క్ ఫోర్స్ సమన్వయంతో

43 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి 786.63 కిలోల గంజాయి, 1040 గ్రాముల అల్ఫాజోలం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

-సైబర్ నేరాలు :

2025లో సైబర్ నేరాల ద్వారా కోల్పోయిన రూ.34.64




కోట్లలో రూ.7.03 కోట్లు హెూల్డ్ చేయడం జరిగిందన్నారు. ప్రజలను మోసాలకు గురికాకుండా "సైబర్ జాగ్రుకత దివాస్" కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

-డయల్ 100 %డ% సీసీ కెమెరాలు :

67,921 డయల్ 100 కాల్స్‌కు సగటున 6 నిమిషాల్లో స్పందన ఇచ్చామని, జిల్లా వ్యాప్తంగా 2,150 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

-రోడ్డు ప్రమాదాలులి : గత ఏడాదితో పోలిస్తే

-రోడ్డు ప్రమాదాలు 4.2% తగ్గాయి

-మరణాలు 2.3% తగ్గాయి

- గాయస్థులు 11.4% తగ్గారు

-ఎన్నికల నిర్వహణ %- 2025

గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో శాంతియుతంగా నిర్వహించబడినట్లు తెలిపారు.

ఎన్నికల బందోబస్తుకు 1,300 మంది పోలీసు సిబ్బంది నియమించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత ఎన్నికలను నిర్వహించడం జరిగింది అన్నారు. .

-సంక్షేమ కార్యక్రమాలు :

పోలీసు సిబ్బంది మరియు వారి కుటుంబాల కోసం మెగా హెల్త్ క్యాంప్,

పోలీస్ గ్యాస్ హెూమ్ డెలివరీ, %జూజ% కాంటీన్ ఆధునీకరణ, హెూంగార్డ్స్ కార్యాలయాలు, పరేడ్ గ్రౌండ్ పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు.

ప్రజల సహకారంతోనే జిల్లాలో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# మేరా యువ భారత్-మినిస్ట్రీ ఆఫ్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా మహోత్సవం 2025-2026 ప్రారంభం.

విజయవాడ, డిసెంబర్ 23(భారత శక్తి):

"మేరా యువ భారత్-మినిస్ట్రీ ఆఫ్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్" ఆధ్వర్యంలో, శ్రీ వెంకటేశ్వర జూనియర్ అండ్ డిగ్రీ కాలేజ్ భీమడోలు , ఏలూరు వేదికగా 2025%-%2026 జిల్లా స్థాయి క్రీడా పోటీలు వైభవంగా ప్రారంభమయ్యాయి. యువతలో క్రీడా స్పూర్తి, నాయకత్వం, సమూహ భావన, శారీరక-మానసిక వికాసాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.

ఈ క్రీడా పోటీలను జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలలు, విద్యాసంస్థల నుండి వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు .వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించబడ్డాయి .కళాశాల ప్రిన్సిపల్ బి రవి కుమార్ గారు , కరస్పాండెంట్ డిఎంవి భవాని సింగ్ , డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ సుంకర రాము గారు ఇటువంటి స్పోర్ట్స్ మీట్స్ కు శ్రీ వెంకటేశ్వర జూనియర్ అండ్ డిగ్రీ కాలేజ్ చక్కని వేదిక అని తమ ప్రోత్సహకం తప్పనిసరిగా ఉంటుందని అన్నారు . కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిస్ట్రిక్ట్ యుత్ ఆఫీసర్ సుంకర రాము మాట్లాడుతూ, కొత్త తరానికి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసే వేదికగా ఈ పోటీలు పనిచేస్తాయని అభినందించారు.

విద్యార్థులు క్రీడల ద్వారా క్రమశిక్షణ, టీమ్ స్పిరిట్ వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. శ్రీ వెంకటేశ్వర



జూనియర్ అండ్ డిగ్రీ కాలేజ్ కాలేజ్ ప్రిన్సిపాల్ బి రవి కుమార్ మాట్లాడుతూ, "మేరా యువ భారత్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు తమ ప్రతిభను ప్రదర్శించే అపూర్వ అవకాశం లభించింది. మా కాలేజ్ ఈ కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా భావిస్తున్నాం," అని తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ సురేష్ గారు విద్యార్థుల సమిష్టి కృషితో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. విజేతలకు పతకాలు, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేసారు .ఈ కార్యక్రమం లో కాలేజ్ ప్రిన్సిపల్ బి రవికుమార్ , మేరా యువభారత్ వాలంటీర్లు జక్కుల రోహిత్ కుమార్, సుమలత, మమత సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ శ్రీమతి కాకర్ల రాణి గారు పాల్గొన్నారు.

# సదాశివపేట ఊబ చెరువులో చేప పిల్లల విడుదల చేసిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 23:

సదాశివపేట పట్టణం లోని ఊబ చెరువులో మంగళవారం టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మత్స్య సహకార శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వం లో రాష్ట్రం లో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి, పరిశ్రమ పై ఆధార పడ్డ కులాల అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. భవిష్యత్ లో మత్స్య పరిశ్రమ పై ఆధారపడ్డ కులాలకు మరిన్ని సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమం లో ఊబ చెరువు సొసైటీ చైర్మెన్ హనుమంత్, నాయకులు శంకర్,సిడిసి చైర్మెన్, సదాశివపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామ్ రెడ్డి, సదాశివపేట మాజీ మున్సిపల్ చైర్మన్



సత్యనారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, మండల కాంగ్రెస్ నాయకులు సిద్దన్న, పిల్లోడి విశ్వనాథ్, ఆశిరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డిఎఫ్ఓ.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 23 (భారత శక్తి): జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను, కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లాకు నూతనంగా బదిలీపై వచ్చిన జిల్లా అటవీ శాఖ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, పూల మొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు వచ్చిన డిఎఫ్ఓ కు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రమశిక్షణతో తన ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం ఇరువురు సమావేశమై, జిల్లా అటవీ శాఖకు సంబంధించిన పలు అంశాలను చర్చించారు.

# మహిళా సాధికారతకు చక్కటి వేదిక.. ఆర్తి విలేజ్.: జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి

కడప, డిసెంబర్ 23(భారత శక్తి) : మహిళా సాధికారత సాధనకు, బాలికల విద్యా, నైపుణ్య సామర్థ్యాల పెంపునకు చక్కటి వేదికగా నిలిచిన.. ఆర్తి ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం అని జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి తెలిపారు.

విజయ్ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా బాలికలకు, మహిళలకు విశిష్ట సేవలు అందిస్తున్న ఆర్తి హెూమ్ (ఆర్తి విలేజ్) ప్రాంగణాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సందర్శించి.. హెూమ్ పనితీరును పరిశీలించారు.

ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు పుచ్చలపల్లి సంధ్యా.. సంస్థ స్థాపన నుంచి ఇప్పటి వరకు ఆర్తి ఫౌండేషన్ ప్రగతిని జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఆర్తీ విలేజ్ లోని ప్రతి విభాగాన్ని కలెక్టర్ గారు సందర్శించి వారి సేవలను, పనితీరును ప్రశంసించారు. ఆర్తి విలేజ్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ కిచెన్ ను సందర్శించి.. వంటకాల తయారీని పరిశీలించారు. అనంతరం సంస్థలో పనిచేసే సిబ్బందిని, అక్కడ ఆశ్రయం పొందుతున్న విద్యార్థులను పరామర్శించి పలకరించారు. అలాగే బాగోగులు, విద్య మరియు ఇతర విషయాలను, వారి ప్రగతిని అడిగి

**అనంతరం ఆర్తి హెూమ్ ద్వారా కడపలోని 10 స్లమ్ ఏరియాల్లో నిర్వహించబడుతున్న విద్యా, యువత అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి.. నిర్వహకురాలు ప్రభుత్వ యంత్రాంగం తరఫు మద్దతును కోరారు. అందుకు తమ తరఫు నుంచి పూర్తి సహాయ సహకారాన్ని అందిస్తామని కలెక్టర్ తెలిపారు.**

తెలుసుకున్నారు.

అనంతరం ఆర్తి హెూమ్ ద్వారా కడపలోని 10 స్లమ్ ఏరియాల్లో నిర్వహించబడుతున్న విద్యా, యువత అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి.. నిర్వహకురాలు ప్రభుత్వ యంత్రాంగం తరఫు మద్దతును కోరారు. అందుకు తమ తరఫు నుంచి పూర్తి సహాయ సహకారాన్ని అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ కడప తహశీల్దార్ నారాయణ రెడ్డి, ఆర్తి హెూం కార్యదర్శి దుర్గా కుమారి, డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ఆపో్కో రిటైర్డ్ ఎండి ప్రసాద్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో సర్కారు వైఫల్యం

## -జర్నలిస్టులకు అన్యాయం చేసే జీవోలెందుకు?
## -అక్రెడిటేషన్ల జీవో తప్పుల తడక
## -జీవోను వెంటనే సవరించాలి
## -టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య

సూర్యాపేట,డిసెంబర్ 23(భారత శక్తి): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన రెండేళ్లలో జర్నలిస్టులకు చేసిన మేలు శూన్యమని అన్నారు.మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభ సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మామిడి



సోమయ్య మాట్లాడుతూ, రెండేళ్ల తర్వాత ప్రభుత్వం ఆగమేఘాల మీద జారీ చేసిన అక్రెడిటేషన్ల జీవో తప్పుల తడకగా ఉందని అన్నారు.అక్రెడిటేషన్ రూల్స్-2025'ను ఖరారు చేస్తూ జారీ చేసిన జీవో 252 జర్నలిస్టులకు అన్యాయం చేసేదిగా ఉందని,జర్నలిస్టులకు అన్యాయం చేసే ఇలాంటి జీవోలెందుకని ప్రశ్నించారు. ఈ జీవోను వెంటనే సమీక్షించి సవరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ జీవో ద్వారా కేవలం కొద్ది మంది జర్నలిస్టులకే మేలు జరుగుతుందని, మెజారిటీ జర్నలిస్టులకు, ముఖ్యంగా చిన్న పత్రికల జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీవో ద్వారా ప్రభుత్వం చిన్న పత్రికలను చిదిమేస్తూ మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు చేసిందని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 239కు ఈ జీవోకు పెద్ద తేడా ఏమీ లేదని అన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి గత రెండు సంవత్సరాలుగా కమిటీల పేరుతో కాలయాపన చేసి చివరికి చిన్న, మధ్య తరహా పత్రికల నోట్లో మట్టి కొట్టే విధంగా రూల్స్ తయారు చేశారని దుయ్యబట్టారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని, లేదంటే పూర్తిగా సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు గడిచినా జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కరించలేదని, కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వలేక పోయిందని విమర్శించారు. విభిన్న ప్రకటనలతో రెండేళ్లుగా జర్నలిస్టులను అయోమయానికి గురిచేశారని, కమిటీల పేరుతో సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేశారని అన్నారు. జర్నలిస్టులను మభ్యపెట్టేందుకు తప్పుడు ప్రకటనలు చేయడం సరైంది కాదని, ప్రభుత్వానికి పెద్దగా ఆర్థిక భారం లేని సమస్యలను కూడా పరిష్కరించకపోవడం శోచనీయమని అన్నారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాల ఊసే లేదని, సుప్రీం కోర్టు తీర్పు సాకుతో ప్రభుత్వం జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే హామీ నుంచి తప్పించుకుంటున్నదని ధ్వజమెత్తారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేయడం తగదని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాపితంగా ఆందోళన చేపడతామని ఆయనహెచ్చరించారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులివలువుల ఆనందం మాట్లాడుతూ,పక్క రాష్ట్రాల్లో అమలవుతున్న జర్నలిస్టుల పెన్షన్ స్కీం, మన రాష్ట్రంలో అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో చిన్న మధ్య తరహా పత్రికలు మరింత చితికిపోతున్నాయని, అడ్వర్టయిజ్మెంట్లు లేక, రావాల్సిన బిల్లులు రాక పత్రికలు మనుగడ సాగించలేకపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల ఒకటో తేదీన రాష్ట్ర సమాచార పౌరసంబధాల శాఖ కమీషనర్ కార్యాలయం ఎదుట తాము ధర్నా చేయడం వల్ల ఆగమేఘాల మీద అక్రెడిటేషన్ల జీవో జారీ చేసిందని, మిగతా సమస్యలపై ప్రభుత్వంలో చలనం లేదని అన్నారు. ఫెడరేషన్ జిల్లా మాజీ కార్యదర్శి పాల్వాయి జానయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అడ్ హక్ కమిటీ ఏర్పాటు

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన(టీడబ్ల్యూజేఎఫ్) సూర్యాపేట జిల్లా అడ్ హక్ కమిటీ ఏర్పడింది. కమిటీ అధ్యక్షుడిగా పాల్వాయి జానయ్య , కో-కన్వీనర్లుగా ముషం హరి, లింగాల సాయి, శ్రీరాముల కృష్ణ, దోరేపల్లి శ్రీనివాస్, తాందారుపల్లి శ్రీనివాస్, నందిపాటి సైదులు, గూడపూరి ప్రభాకర్ (ప్రభు), ఒగ్గు సోమన్న, కొంగల సతీష్, షేక్ నజీర్, వంగాల వెంకన్న తదితరులు నియమితులయ్యారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సభ్యత్వ నమోదు, జిల్లా మహాసభలు జరుగుతాయని ఫెడరేషన వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రకటించారు.



## సీఐడీ విచారణకు హాజరైన మంచు లక్ష్మి

సినీనటి మంచు లక్ష్మి మంగళవారం సీఐడీ విచారణకు హాజరయ్యారు. దీనికోసం నేడు లక్డీకపూల్‌లోని సీఐడీ కార్యాలయానికి ఆమె వచ్చారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన వ్యవహారంలో ఆ యాప్‌ల నుంచి తీసుకున్న పారితోషికం, కమీషన్లపై అధికారులు ఆమెను ప్రశ్నిస్తున్నారు. గతంలో ఈ కేసు విషయంలో మంచు లక్ష్మిని ఈడీ కూడా విచారించిన సంగతి తెలిసిందే. ఆమెతో పాటు విజయ్ దేవరకొండ, రానా, ప్రకాశ్‌రాజ్‌లు కూడా గతంలో విచారణకు హాజరయ్యారు.

## సమంతతో వర్క్ చేయడం చాలా ఈజీ

**: బాలీవుడ్ నటుడు**



సమంత అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. నందిని రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో సమంత సరసన బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య నటిస్తున్నారు. తాజాగా ఆయన ఒక ఇంటర్వ్యూలో ఆమెతో కలిసి వర్క్ చేయడం గురించి మాట్లాడారు. ''ఈ చిత్రంలో మా ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ బాగుంటుంది. ఆమె నీకి నిర్మాత అయినప్పటికీ సెట్‌లో ఎప్పుడూ నటిగానే వ్యవహరిస్తారు. దీని షూటింగ్ ఇటీవలే ప్రారంభమైంది. ఇంకా చాలా ఉంది. సమంతతో వర్క్ చేయడం చాలా సులభం. ఈ సినిమా టీమ్‌ను ఎప్పటికీ మర్చిపోలేను'' అని గుల్షన్ తెలిపారు. సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై 'మా ఇంటి బంగారం' రూపొందుతోంది. 'ఓ బేబీ' విజయం తర్వాత నందిని రెడ్డి సమంత కలయికలో వస్తున్న చిత్రమిది. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో సమంత మునుపెన్నడూ చూడని లుక్‌లో కనిపించనుందని చిత్రవర్గాలు తెలిపాయి.

## తొలినాళ్లలో చాలా బాధపడేవాడిని

**: ఆది సాయికుమార్**

కొవిడ్‌కు ముందుతో పోలిస్తే కొవిడ్ తర్వాత తన కెరీర్ మారిందని ఆది సాయికుమార్ అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'శంబాల'. డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆది.. తాను నటించిన కొన్ని సినిమాల వైఫల్యాల గురించి మాట్లాడారు. ''నేను నటించిన సినిమాలు ఒకటి థియేటర్‌లో విడుదలయ్యే సమయానికి మరొకటి షూటింగ్ తుది దశలో ఉండేది. దీంతో ఎక్కువగా ఆలోచించడానికి సమయం ఉండేది కాదు. 25 సినిమాలు చేశాను.. ప్రతి ఏడాది రెండు చిత్రాలు విడుదలయ్యేవి. తొలినాళ్లలో నా చిత్రం అనుకున్న స్థాయిలో విజయం సాధించకపోతే చాలా బాధపడేవాడిని. సడన్‌గా వేరే ఊరు వెళ్లిపోయేవాడిని. ఆ తర్వాత నా వైపు నుంచి ఏదోఒక స్పెషల్ ఉండాలని కొత్తగా ప్రయత్నించడం ప్రారంభించాను.


# సినిమా

## వారణాసి కోసం కలరిపయట్టు






టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబోలో తెరకెక్కుతున్న భారీ అడ్వెంచర్ డ్రామా 'వారణాసి' దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రానికి మహేశ్ బాబు చేస్తున్న కఠినమైన సన్నాహాలు, చూపిస్తున్న అంకితభావం చూస్తుంటే.. జక్కన్న మరోసారి వెండితెరపై ఒక అద్భుతాన్ని ఆవిష్కరించబోతున్నారనే చర్చ సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ముఖ్యంగా 'వారణాసి'లో 'రుద్ర' అనే శక్తివంతమైన పాత్ర కోసం మహేశ్ బాబు కేరళకు చెందిన ప్రాచీన యుద్ధ విద్య 'కలరిపయట్టు'లో స్పెషల్‌ట్రైనింగ్ తీసుకుంటున్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కలరిపయట్టు నిపుణుడు హరి కృష్ణన్ తాజాగా ప్రిన్స్ బాబుతో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో పంచుకుంటూ తన అనుభవాన్ని వెల్లడించారు. భారతీయ సినిమా గ్లోబల్ స్టార్‌కు కలరిపయట్టు శిక్షణ ఇవ్వాల్సి వస్తుందని తాను ఎప్పుడూ ఊహించలేదని మహేశ్ డెడికేషన్‌కు ట్రైనర్ ఫిదా అయ్యాడు. ఈ అరుదైన చాన్స్ ఇచ్చిన నటుడు నాజర్, దర్శకుడు రాజమౌళిలకు కృతజ్ఞతలు తెలిపారు.



## పెళ్లయిపోయిందా?



టాలీవుడ్ నటుడు జగపతి బాబు తన రెండో కుమార్తె పెళ్లయిపోయిందని ప్రకటించాడు. ఇన్‌స్టాలో ఒక వీడియోను షేర్ చేశారు. అయితే ఈ వీడియోను పూర్తిగా ఏఐ సాంకేతికతతో రూపొందించిందే..! ఆ వీడియోకు "ఇలా మా రెండో అమ్మాయి పెళ్లయిపోయిందోచ్' క్యాప్షన్ ఇచ్చాడు. పెళ్లికి సంబంధించిన అసలు ఫొటోలను కానీ, అల్లుడి వివరాలు కానీ బయటపెట్టలేదు. ఈ క్రియేటివ్ వీడియోతోనే విషయాన్ని వెల్లడించారు. ఈ వీడియో చూసిన నెటిజన్లు విభిన్న రకాలుగా స్పందిస్తున్నారు. సెలబ్రిటీల ఇంట్లో పెళ్లంటే హడావుడి చాలా ఎక్కువగా ఉండాలి కానీ ఇదేంటని ముక్కున వేలేసుకుంటున్నారు. ఆ వీడియోలో చూపించినట్లు జగపతిబాబు రెండో కూతురు నిజంగానే పెళ్లి చేసుకుందా? లేకపోతే ఆయన సరదాగా ఆ వీడియో షేర్ చేశారా? అన్నది హాట్ టాపిక్ గా మారింది.

## గ్రీన్‌శారీలో చమక్కు

టాలీవుడ్ లో మంచి క్రేజ్‌సొంతం చేసుకున్న అచ్చమైన తెలుగమ్మాయి అంజలి. నటన ప్రాధాన్యత ఉన్న చిత్రాలనే ఎంచుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. గ్లామర్ షోలకు దూరంగా ఉంటూనే సహజ నటనతో కట్టిపడేస్తుంది. మరోవైపు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటున్న అంజలి.. నిత్యం ఏదో ఒక పోస్ట్‌చేస్తూ నెటిజన్లను అలరిస్తుంది. తాజాగా ట్రెడిషనల్ లుక్‌లో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఎమరాల్డ్ గ్రీన్ కలర్ శారీలో మెరిసిపోతుంది. సాఫ్ట్‌ఎంబ్రాయిడరీ, జుమ్కాలు, ముఖ కవళికలు, నాజూకైన హావభావాలు ఆమె అందాన్ని మరింత ఎలివేట్ చేస్తున్నాయి. ఇక సినిమాల సంగతి విషయానికొస్తే .. అంజలి మూవీ కెరీర్ కూడా ప్రస్తుతం జోరుగా సాగుతోంది. లేటెస్టుగా ఆమె రాజశేఖర్ రెడ్డి పులిచర్ల దర్శకత్వంలో, 9 క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఓ లేడీ ఓరియెంటేడ్ సినిమాలో ప్రధాన పాత్రలో నటిస్తోంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో స్పీడ్ గా కొనసాగుతోంది. బలమైన భావోద్వేగాలు, సహజమైన కథనంతో ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ హామీ ఇస్తున్నారు. ఇక విశాల్ నటిస్తున్న 35వ చిత్రంలో కూడా అంజలి కీలక పాత్రలో చేరిన విషయం అభిమానుల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది.



## శివాజీ వ్యాఖ్యలు.. ఆయన తరఫున నేను క్షమాపణ చెబుతున్నా: మంచు మనోజ్





హీరోయిన్‌ల అందం వాళ్లు వేసుకునే డ్రెస్‌లోనే ఉంటుందని నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆయన ప్రధాన పాత్రలో నటించిన 'దండోరా' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడుతూ.. నటీమణులు కొంచెం డ్రెస్ సెన్స్ పాటించాలని, ఇలా చెబుతున్నందుకు ఏమనుకోవద్దని చెబుతూనే, ప్రతిదానికి ఒక హద్దు ఉండాలన్నారు. స్వేచ్ఛ అనేది అదృష్టమన్న ఆయన దాన్ని కోల్పోవద్దంటూ మాట్లాడారు. శివాజీ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవడంతో పలువురు మహిళలు, నటీనటులు తీవ్రంగా స్పందిస్తున్నారు. దుస్తుల పేరుతో మహిళలను ఒక ఛట్రంలో బిగించడం సరైనది కాదని మండిపడుతున్నారు. తాజాగా నటుడు మంచు మనోజ్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. శివాజీ పేరు ఎత్తకుండా ఆయన తరఫున మహిళాలోకానికి క్షమాపణలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. ''ఇలాంటి ప్రకటన చేయడం తీవ్ర నిరాశకు గురిచేసింది. మహిళలు ఫలానా దుస్తులు మాత్రమే వేసుకోవాలి.. నైతికంగా ఇలాగే ఉండాలంటూ ఒక ఛట్రంలో పెట్టడం ఆమోదయోగ్యమైనది కాదు. గౌరవం, జవాబుదారీతనం వ్యక్తిగత ప్రవర్తన ద్వారా మాత్రమే వస్తుంది. దుస్తులను బట్టి ఎదుటివారిని ఎగతాళి చేయడం ద్వారా రాదు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కూడా రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ఉల్లంఘించడమే. సమానత్వం, గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ విషయంలో చర్చలకు తావులేదు. ప్రజల అభిప్రాయాల మేరకు మహిళలు దుస్తులు వేసుకోరు. మహిళలను వస్తువుల్లా చూస్తూ, అగౌరవ పరిచేలా సీనియర్ నటుడి చేసిన వ్యాఖ్యలకు ఆయన తరఫున నేను క్షమాపణ చెబుతున్నా. అయితే, అందరు ఆయనలా మాట్లాడతారని అనుకోవద్దు. మౌనంగా ఇవన్నీ ఉపేక్షించాల్సిన అవసరం లేదు. మహిళలకు ఎల్లప్పుడూ గౌరవం, హోదా, సమానత్వం ఇవ్వాలి. ఇలాంటి విషయాల్లో జవాబుదారీతనం అవసరం''అని పేర్కొన్నారు.

# సూర్యకుమార్‌తో శుభ్‌మన్ గిల్‌ను పోల్చలేం: మహ్మద్ కైఫ్

వచ్చే ఏడాది జరగనున్న టీ20 ప్రపంచ కప్ కోసం ఇటీవల భారత జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. కొంతకాలంగా నిరాశపరుస్తున్న కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను కొనసాగించిన సెలక్టర్లు.. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పై వేటు వేశారు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా భారత మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్ ఈ అంశంపై స్పందించాడు. సూర్యకుమార్, శుభ్‌మన్ గిల్ తమ టీ20 ప్రయాణాల్లో చాలా భిన్నమైన దశల్లో ఉన్నారని, వీరిద్దరిని ఒకే రకంగా చూడలేమని పేర్కొన్నాడు. గతంలో సూర్యకుమార్ ఆడిన భారీ ఇన్నింగ్స్ వల్ల అతడిపై



సెలక్టర్లు నమ్మకం ఉంచారని, గిల్ ఇంకా టీ20ల్లో నిరూపించుకోవాల్సిన అవసరముందని కైఫ్ అభిప్రాయపడ్డాడు. 'గిల్, సూర్యకుమార్‌ల మధ్య చాలా తేడాలున్నాయి. టీ20ల్లో సూర్య మ్యాచ్ విన్నర్‌గా నిరూపించుకున్నాడు. అతను ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్ 10లో ఉన్నాడు. ఎన్నో మ్యాచ్‌ల్లో భారత్‌ను ఒంటిచేత్తో గెలిపించాడు. సూర్యతో గిల్‌ను పోల్చలేం. శుభ్‌మన్ అంతర్జాతీయ టీ20ల్లో ఇంకా తనను తాను నిరూపించుకోవాలి. ఉదాహరణకు కోహ్లీని తీసుకోండి. అతను కొవిడ్ సమయంలో ఆ రెండేళ్ల పాటు పెద్దగా పరుగులు చేయలేదు. కానీ అంతకుముందు అతనికి గొప్ప రికార్డు ఉంది. 10 సంవత్సరాలపాటు మ్యాచ్ విన్నర్‌గా ఉన్నాడు. దీంతో కోహ్లీకి మద్దతుగా నిలవగా.. పేలవ ఫామ్ నుంచి బయటపడి మళ్లీ భారీ స్కోర్లు చేయడం ప్రారంభించాడు. సూర్య కూడా ఈ కేటగిరిలోనే ఉన్నాడు. టీ20 ఫార్మాట్‌లో సూర్యకు గిల్ ఎక్కడా చేరువలో లేడు. ఫామ్‌లో లేరని ఇద్దరిని జట్టు నుంచి తొలగించాలనడం సరికాదు' అని కైఫ్ వివరించాడు. సూర్యకుమార్ ఈ ఏడాది టీ20ల్లో 19 ఇన్నింగ్స్‌ల్లో 218 పరుగులు చేశాడు. ఆసియా కప్ పాక్‌పై అత్యధికంగా 47 పరుగులు చేశాడు. గిల్ విషయానికొస్తే.. 15 మ్యాచ్‌ల్లో 291 పరుగులు చేశాడు. దీంతో శుభ్‌మన్‌పై వేటు వేసి అక్షర్ పటేల్‌కు వైస్ కెప్టెన్సీ పగ్గాలు అప్పగించారు.

### ఒకే ఓవర్‌లో 5 వికెట్లు..


## టీ20ల్లో ప్రపంచ రికార్డ్

ఇండోనేషియా బౌలర్ గ్రెడే ప్రియాందన సంచలనం సృష్టించాడు. అంతర్జాతీయ టీ20ల్లో ఒకే ఓవర్‌లో ఏకంగా 5 వికెట్లు తీసిన తొలి క్రికెటర్‌గా సరికొత్త చరిత్ర లిఖించాడు. కంబోడియాతో జరిగిన మ్యాచ్‌లో తాను వేసిన తొలి ఓవర్‌లోనే ప్రియాందన ఈ ఘనత సాధించడం మరో విశేషం. బాలి వేదికగా ఇండోనేషియాకంబోడియా మధ్య మంగళవారం తొలి టీ20 మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండోనేషియా 168 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఛేదనలో కంబోడియా 15 ఓవర్లకు 106/5 వద్ద పటిష్టంగానే కన్పించింది. దీంతో 16వ ఓవర్‌లో కుడిచేతి వాటం బౌలర్ ప్రియాందనను దించింది ఇండోనేషియా జట్టు. ఈ మ్యాచ్‌లో అతడికి ఇదే తొలి ఓవర్. అయితేనేం.. మెరుపుల్లాంటి బంతులతో కంబోడియా బ్యాటర్లను వణికించాడీ బౌలర్. తొలి మూడు బంతుల్లో ముగ్గురిని పెవిలియన్‌కు పంపి హ్యాట్రిక్ సాధించిన ప్రియాందన.. తర్వాతి బంతిని డాట్ బాల్‌గా మార్చాడు. అనంతరం మిగిలిన రెండు బంతుల్లో మరో ఇద్దరిని ఔట్ చేయడంతో కంబోడియా పోరాటం ముగిసింది. ఈ ఓవర్‌లో చివరి రెండు వికెట్ల మధ్య వైడ్ రూపంలో కంబోడియాకు ఒక పరుగు దక్కింది. 107 పరుగులకు ఆలౌట్ అయిన కంబోడియా జట్టు.. 60 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఇదే మ్యాచ్‌లో ఇండోనేషియా ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన ప్రియాందన..



11 బంతుల్లో 6 పరుగులు చేశాడు. కానీ, బంతితో మాత్రం అదరగొట్టి.. అంతర్జాతీయ టీ20ల్లో ఇప్పటివరకూ ఏ క్రికెటర్‌కు సాధ్యం కాని రికార్డును సృష్టించాడు. గతంలో ఇలాంటి ఫీట్ దేశవాళీ టీ20ల్లో రెండుసార్లు నమోదైంది. 201314లో విక్టరీడే టీ20 కప్‌లో భాగంగా యూసీబీబీసీబీ ఎలెవన్ జట్టు తరఫున బంగ్లాదేశ్ ఆటగాడు అల్ అమీన్ హొస్సేన్ ఒకే ఓవర్‌లో 5 వికెట్లు తీశాడు. ఇక, 201920లో సయ్యద్ ముస్తాఖ్ అలీ ట్రోఫీ సెమీఫైనల్‌లో కర్ణాటక ఆటగాడు అభిమన్యు మిథున్ హరియాణాపై ఈ ఘనత సాధించాడు. కానీ, అంతర్జాతీయ క్రికెట్‌లో మాత్రం ప్రియాందనదే తొలి రికార్డ్. అయితే, ఇప్పటివరకు 14 సార్లు ఒకే ఓవర్‌లో నాలుగు వికెట్లు తీసిన సందర్భాలున్నాయి.

## స్టార్ ఆటగాళ్ల సందడి.. విజయ్ హజారే ట్రోఫీకి కొత్త కళ






ఇంతకుముందు విజయ్ హజారే ట్రోఫీ అంటే అభిమానుల్లో పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. టోర్నీ ఎప్పుడు మొదలైంది, ఎప్పుడు ముగిసిందో కూడా చాలామందికి తెలిసేది కాదు. కానీ, ప్రస్తుతం భారత జట్టులో ఉన్న క్రికెటర్లందరూ కనీసం రెండు మ్యాచ్‌లు ఆడాలని బీసీసీఐ షరతు విధించడంతో ఈ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీకి కొత్త కళ వచ్చింది. స్టార్ ఆటగాళ్లు తమ తమ రాష్ట్రాల జట్ల తరఫున బరిలోకి దిగుతున్నారు. డిసెంబరు 24 నుంచి మొదలుకానున్న ఈ టోర్నమెంట్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మతోపాటు మరికొంత మంది స్టార్ ప్లేయర్లు సందడి చేయనున్నారు. కోహ్లీ 15 ఏళ్ల తర్వాత విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతుండటం విశేషం.

**మళ్లీ రో-కో ఫైర్ చూస్తామా?**

ముంబయికి ప్రాతినిధ్యం వహిస్తున్న రోహిత్ శర్మ .. డిసెంబర్ 24, 26న సిక్కిం, ఉత్తరాఖండ్‌తో మ్యాచ్‌ల కోసం జైపుర్ చేరుకున్నాడు. రోహిత్ ఇప్పటివరకు ఈ టోర్నీలో 18 మ్యాచ్‌లు ఆడి 600 రన్స్ చేశాడు. 200506 సీజన్‌లో వెస్ట్ జోన్‌కు ఆడిన హిట్‌మ్యాన్.. నార్త్ జోన్‌పై 142 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ ఇన్నింగ్స్‌తోనే దేశవాళీ క్రికెట్‌లో రోహిత్ వెలుగులోకి వచ్చాడు. ఇక, కొన్ని రోజుల కిందట లండన్ నుంచి భారత్‌కు చేరుకున్న కోహ్లీ ముంబయిలో ముమ్మరంగా ప్రాక్టీస్ చేశాడు. దిల్లీకి ఆడనున్న కోహ్లీ.. ఆంధ్రతో మ్యాచ్ కోసం బెంగళూరు వెళ్లాడు. విజయ్ హజారేలో 'కింగ్'కు మంచి రికార్డు ఉంది. 20089 సీజన్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడి నాలుగు శతకాలు బాది 534 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తర్వాతి సీజన్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడి 229 రన్స్ చేశాడు. ఇటీవల సఫారీలతో వన్డే సిరీస్‌లో రాణించిన రోకో విజయ్ హజారే ట్రోఫీలోనూ అలరించాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

**పంత్ సద్వినియోగం చేసుకుంటాడా?**

కొంతకాలంగా టెస్టులకే పరిమితమైన రిషభ్ పంత్ దిల్లీకి ఆడనున్నాడు. ఈ టోర్నీలో సత్తాచాటి తిరిగి పరిమిత ఓవర్ల క్రికెట్‌లోకి ఎంట్రీ ఇవ్వాలనుకుంటున్నాడు. మరి అతను ఏ మేరకు రాణిస్తాడో చూడాలి. టీ20 ప్రపంచ కప్ జట్టులో చోటు దక్కించుకోవడంతో నిరాశలో ఉన్న శుభ్‌మన్ గిల్ పంజాబ్ తరఫున బరిలోకి దిగుతున్నాడు. వచ్చే నెలలో కివీస్‌తో వన్డే సిరీస్ ఉన్నందున ఈ టోర్నీ అతనికి మంచి సన్నాహకంగా ఉపయోగపడనుంది.

**కొత్త పేసర్లు వెలుగులోకి వస్తారా?**


విజయ్ హజారే ట్రోఫీలో ప్రతిభావంతులైన యువ పేసర్లు వెలుగులోకి వస్తారని సెలక్టర్లు ఆశిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం రంజీ ట్రోఫీలో రాణించిన మహ్మద్ సిరాజ్.. తర్వాత వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని భారత జట్టులో రెగ్యులర్ ఆటగాడిగా మారాడు. సిరాజ్ తర్వాత దేశవాళీ క్రికెట్‌లో మరో కొత్త పేసర్ ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేదు. ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, ఆకాశ్ దీప్ వంటి పేసర్లు వెలుగులోకి వచ్చినా వారిలో నిలకడ లేదు. గుర్జప్నీత్ సింగ్ (తమిళనాడు), గుర్నూర్ బ్రార్ (పంజాబ్), యుద్ధ్వీర్ సింగ్ (జమ్మూ కశ్మీర్), అనుజ్ థక్రాల్ (హరియాణా), సాకిబ్ హుస్సేన్ (బిహార్) ఈ టోర్నీలో రాణిస్తారనే అంచనాలున్నాయి.




### ఆండ్రాయిడ్ ఫోన్లలో

## ఎమర్జెన్సీ లొకేషన్ సేవలు

భారత్‌లోని ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల కోసం గూగుల్ కొత్త ఫీచర్ తీసుకొచ్చింది. దేశంలో ఎమర్జెన్సీ లొకేషన్ సేవలను ప్రారంభించింది. పోలీస్, అగ్నిమాపక, వైద్యం వంటి అత్యవసర సేవల విభాగానికి కాల్ లేదా టెక్స్ట్ చేసినప్పుడు ఈ ఫీచర్ ద్వారా మీ లొకేషన్ లభిస్తుంది. ఈ సేవలను పొందాలంటే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తమ అత్యవసర సేవలతో ఈఎల్ఎస్‌ను అనుసంధానించాల్సి ఉంటుంది. తొలుత ఉత్తర్‌ప్రదేశ్ పోలీసు విభాగం ఈ సేవలను అందిపుచ్చుకుంది. ఆండ్రాయిడ్ ఫోన్ నుంచి ఎవరైనా అత్యవసర సేవల విభాగానికి ఫోన్ చేయగానే ఆటోమేటిక్‌గా వారి కచ్చితమైన లొకేషన్ వివరాలు అవతలి వారికి చేరుతాయి. ఏదైనా కారణంతో క్షణాల్లో కాల్ కట్ అయినా లొకేషన్ వివరాలు అందుతాయి. జీపీఎస్, వైఫై, సెల్యులర్ నెట్‌వర్క్ ఆధారంగా ఈఎల్ఎస్ పనిచేస్తుంది. 112 లేదా ఇతర




ఎమర్జెన్సీ నంబర్‌కు కాల్ చేసినప్పుడు ఈ ఫీచర్ పనిచేస్తుంది. దీనికి అదనపు హార్డ్‌వేర్‌గానీ, యాప్స్‌గానీ అవసరం లేదని గూగుల్ స్పష్టంచేసింది. ఉత్తర్‌ప్రదేశ్ మాదిరిగా ఇతర రాష్ట్రాలూ దీన్ని అందిపుచ్చుకోవాలని సూచించింది. ఆండ్రాయిడ్ 6, ఆపై వెర్షన్ డివైజులకు ఈ ఫీచర్ పనిచేస్తుందని తెలిపింది. ఈ డేటాను గూగుల్ కలెక్ట్ చేయబోదని గూగుల్ స్పష్టంచేసింది.

## బిర్యానీ భళా.. స్విగ్గీలో నిమిషానికి 200 ఆర్డర్లు

దేశవ్యాప్తంగా ఎన్నో రకాల ఆహార పదార్థాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఆహార ప్రియులు మాత్రం బిర్యానీకే జై కొడుతున్నట్లు తెలుస్తోంది. వీటితోపాటు బర్గర్లు, పిజ్జాలు, దోశలను ఎక్కువగా ఆర్డర్ చేసుకుంటున్నారట. ఈ ఏడాది ఆన్‌లైన్ ఆర్డర్లకు సంబంధించి ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ 2025 నివేదికను విడుదల చేయగా.. ఈ ఏడాదిలో మొత్తంగా 9.3 కోట్ల బిర్యానీ ఆర్డర్లు వచ్చినట్లు వెల్లడించింది.



**నిమిషానికి 194 ఆర్డర్లు..**

ఆన్‌లైన్ ఆర్డర్లలో వినియోగదారులు తమ ఫేవరేట్ వంటకంగా బిర్యానీనే ఎంచుకోగా.. నిమిషానికి 194 ఆర్డర్లు వస్తున్నట్లు అంచనా. వీటిలో చికెన్ బిర్యానీదే అగ్రస్థానం. 5.77 కోట్ల చికెన్ బిర్యానీలు ఆర్డర్ వచ్చినట్లు స్విగ్గీ తెలిపింది. ఆ తర్వాతి స్థానంలో బర్గర్లు (4.42 కోట్లు), పిజ్జాలు (4.01 కోట్లు) దోశలు (2.62 కోట్లు) ఉన్నాయని పేర్కొంది.

### సరికొత్త గరిష్ఠాలకు పసిడి..

## ఏడాదిలో రూ.60 వేలు పైకి

హైదరాబాద్: పసిడి ధరల పరుగు కొనసాగుతోంది. దేశీయంగా సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి ధర ఒక్కరోజులోనే రూ.2,650 మేర పెరిగి రూ.1,40,850కు (పన్నులు కలుపుకొని) చేరిందని ఆలిండియా సరఫా అసోసియేషన్ తెలిపింది. సోమవారం 99.9 స్వచ్ఛత కలిగిన పసిడి రూ.1,38,200గా ఉంది. ఇక హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం సాయంత్రానికి 10 గ్రాముల ధర రూ.1,40,820 పలుకుతోంది. ఈ ఒక్క ఏడాదిలోనే బంగారం రూ.61,900 పెరిగింది. 2024 డిసెంబర్ 31న 10 గ్రాముల పసిడి రూ.78,950గా ఉండగా.. నేడు 78 శాతం పెరిగి రూ.1.50 లక్షల దిశగా దూసుకెళ్తోంది. మరోవైపు వెండి కూడా సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. దిల్లీలో కిలో వెండి ధర ఒక్కరోజులోనే రూ.2,750 పెరిగి రూ.2,17,250కి చేరింది. ఈ ఒక్క క్యాలెండర్ సంవత్సరంలో వెండి దాదాపు రూ.1,27,550 పెరిగింది. గతేడాది డిసెంబర్ 31 నాటికి కిలో వెండి ధర రూ.89,700గా ఉంది.




అంటే దాదాపు 142.2 శాతం వృద్ధి నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సు 4,500 డాలర్లకు సమీపించడంతో దేశీయంగా అదే స్థాయిలో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. మరోవైపు వెండి సైతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు తొలిసారి 70 డాలర్ల మార్కు దాటింది. వచ్చే ఏడాది మరోసారి అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత పెడుతుందన్న అంచనాలతో సురక్షిత పెట్టుబడి సాధనాలుగా మదుపర్లు భావిస్తుండడంతో బంగారం, వెండి ధరలు పెరుగుతున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. దీనికి భౌగోళిక అనిశ్చితులు కూడా తోడయ్యాయని పేర్కొన్నారు. అమెరికా మూడో త్రైమాసికానికి సంబంధించి వెలువడే రెండో అంచనాలపై మదుపర్లు దృష్టిసారించే అవకాశం ఉందని అనలిస్టులు చెబుతున్నారు. అమెరికా ఆర్థిక పరిస్థితిపై అంచనాలతో పాటు, ఫెడరల్ రిజర్వ్ భవిష్యత్ నిర్ణయాలపై ఇది ప్రభావం చూపుతుందని పేర్కొంటున్నారు.


### విద్యుత్ కార్లలో టాటా దూకుడు..

## లక్ష విక్రయాలు దాటిన నెక్సాన్.ఈవీ

ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్ పాసింజర్స్ వెహికల్స్ అరుదైన మైలురాయిని సాధించింది. టాటా రూపొందించిన నెక్సాన్.ఈవీ లక్ష విక్రయాలు సాధించిన తొలి విద్యుత్ కారుగా నిలిచింది. మొత్తంగా 2.50 లక్షల విద్యుత్ కార్లను కంపెనీ ఇప్పటి వరకు విక్రయించింది. తద్వారా విద్యుత్ కార్లలో టాటా మోటార్స్ తన అగ్రస్థానాన్ని ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. దేశంలో విక్రయించే ఎలక్ట్రిక్ కార్ల విక్రయాల్లో మూడింట రెండొంతుల వాటా (66 శాతం)తో అగ్రస్థానంలో నిలిచింది. టాటా మోటార్స్ ప్రస్తుతం టియాగో.ఈవీ, పంచ్.ఈవీ, నెక్సాన్.ఈవీ, కర్వ్.ఈవీ, హ్యారియర్.ఈవీలను




విక్రయిస్తోంది. ఫ్లీట్ సెగ్మెంట్‌లో XPREST EVని విక్రయిస్తోంది. వీటిలో నెక్సాన్.ఈవీ విక్రయాల్లో దూసుకెళుతోంది. టాటా విక్రయించే ప్రతి 10 కార్లలో 4 నెక్సాన్.ఈవీ మోడల్‌కు చెందిన కార్లు ఉండడం గమనార్హం. రాబోయే ఐదేళ్లలో ఐదు కొత్త విద్యుత్ మోడళ్లను తీసుకురానున్నట్లు ఈ సందర్భంగా టాటా మోటార్స్ ప్రకటించింది. ఇందులో భాగంగా 202930 నాటికి రూ.1618 వేల కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు తెలిపింది. కొత్త ఉత్పత్తులతో పాటు, దేశవ్యాప్తంగా 10 లక్షల ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటుకు ఈ మొత్తాన్ని వినియోగించనున్నట్లు టాటా మోటార్స్ తెలిపింది. వచ్చే ఏడాది సియారా.ఈవీ, కొత్త పంచ్.ఈవీని లాంచ్ చేయనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర వెల్లడించారు. 2030 నాటికి ప్రీమియం మోడల్ అయిన అవిన్యా కూడా తీసుకురానున్నట్లు చెప్పారు. తద్వారా అన్ని వర్గాల వారికి ఈవీని అందుబాటులో ఉంచడం తమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ పోటీ మార్కెట్‌లో 4550 శాతం మార్కెట్ వాటా ఉండాలన్నది తమ లక్ష్యమని వివరించారు.




* వైద్య పరీక్షల కోసం వస్తే గర్భిణీ ప్రాణం తీశారు
* నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు

# మంజు సుధ హాస్పిటల్ లో దారుణం

* గతంలో అనేక దారుణాలు వెలుగులోకి
* చర్యలు తీసుకోని మేడ్చల్ మల్కాజిగిరి డిఎంహెచ్ఓ

ఎల్బీనగర్, డిసెంబర్ 23 (భారత శక్తి): చైతన్యపురి లోని మంజు సుధ హాస్పిటల్ లో మంగళవారం దారుణం చోటు చేసుకుంది. వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణి ప్రాణం తీసిన సంఘటన జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు చేస్తున్న మంజు సుధ హాస్పిటల్ పై అనేక ఆరోపణలు ఉన్నాయి. గతంలో కూడా ఆరోపణలు రావడంతో సీజ్ చేసినట్లు స్థానికులు తెలిపారు. తిరిగి వైద్యాధికారులు హాస్పటల్ ఓపెన్ చేయించడం, తద్వారా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పొర్లగడ్డతండాకు చెందిన ముదావత్ సునీత (23) తన భర్త హరిలాల్ తో కలిసి సైదాబాద్ లోని ఖాజాబాగ్ కాలనీలో నివాసం ఉంటున్నారు. కాగా సునీత గర్భం దాల్చడంతో వైద్య పరీక్షల కోసం చైతన్యపురిలోని మంజు సుధ హాస్పిటల్ కు 10 రోజుల క్రితం రావడం జరిగింది. గైనకాలజిస్ట్ డాక్టర్ వైద్య పరీక్షలు చేసి ఇంజక్షన్ ఇచ్చి సునీతను ఇంటికి పంపించారు. అయితే ఇంజక్షన్ వికటించడంతో అధిక రక్తస్రావం జరిగింది.వెంటనే హాస్పిటల్ కు రావడంతో సునీత ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఓవైసీ హాస్పిటల్ కు తీసుకెళ్లాలని సూచించారు. వెంటనే కుటుంబసభ్యులు సునీతను ఓవైసీ హాస్పిటల్ కు తరలించి చికిత్స చేయించారు. మూడు రోజులుగా హాస్పిటల్ లో ఉన్నా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మంగళవారం ఉదయం నాలుగు గంటలకు మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మంజు సుధ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యంతో నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ చేయడంతోనే సునీత మృతి చెందినట్లు ఆరోపించారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులతో కలిసి కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. తల్లి మృతి చెందడంతో ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారు.

**హాస్పిటల్ పై అనేక ఆరోపణలు**

మంజు సుధ హాస్పిటల్ పై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హాస్పిటల్ ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు ఇలాంటి కేసులు ఎన్నో నమోదయ్యాయని గతంలో హాస్పిటల్ సీజ్ చేసినా కూడా వారిలో మార్పు రాకపోవడం తిరిగి ఇలాంటి సంఘటనలు జరుగుతున్న నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు భావిస్తుంది. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నిర్లక్ష్యం మూలంగా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా పట్టించుకోవడంలేదని స్థానికులు ప్రజాసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. హాస్పిటల్ కు కనీసం సరిగ్గా బోర్డు ఏర్పాటు చేయకపోవడం, ఇదొక భవనం మాదిరిగా ఉండడం ఆసుపత్రి వాతావరణం లేకపోవడం ఆసుపత్రిలో దారుణాలు జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

# కొత్తపేట చౌరస్తాలో బంగ్లాదేశ్ జిహాదీల దిష్టిబొమ్మ దహనం

ఎల్బీనగర్, డిసెంబర్ 23 (భారత శక్తి): బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరుగుతున్న మారణహోమాన్ని తీవ్రంగా ఖండిస్తూ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, హిందూ వాహిని, స్థానిక బీజేపీ కార్పొరేటర్లతో కలిసి కొత్తపేట చౌరస్తాలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బంగ్లాదేశ్‌లో హింసకు పాల్పడుతున్న జిహాదీ శక్తులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వారి దిష్టిబొమ్మను దహనం చేశారు.హైదరాబాద్ లో ఉన్న కేంద్ర రక్షణ రంగ సంస్థల చుట్టూ రోహింగ్యాలు అక్రమంగా వచ్చి నివాసం ఉంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే పెద్ద సంఖ్యలో అక్రమంగా వలస వచ్చి ఇక్కడ శాశ్వతంగా నివాసాలు ఏర్పరుచుకుని ఉండడం ఆందోళనకర విషయమని, కాంగ్రెస్




ప్రభుత్వం అసమర్ధత వలన, నిఘా లేకపోవడం, అక్రమంగా వలసలకు వస్తున్నారని, వారిని గుర్తించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ వలస దారులకు అడ్డుకట్ట వేయాలని విశ్వ హిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత హిందువులకు న్యాయం చేయాలని, అంతర్జాతీయ సమాజం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆందోళన కారులు డిమాండ్ చేశారు.



# ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసిన బాచుపల్లి ఉపసర్పంచ్ ఎగిరిశెట్టి నరేష్

ఎల్బీనగర్, డిసెంబర్ 23 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండలం బాచుపల్లి గ్రామానికి నూతనంగా ఎన్నికై ఉప సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎగిరిశెట్టి నరేష్ నేడు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి ఉప సర్పంచ్ ఎగిరిశెట్టి నరేష్‌కు వార్డ్ సభ్యులకు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేస్తూ, గ్రామాభివృద్ధికి ప్రజలతో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు దువ్వాసి నరసింహ, వార్డు సభ్యుడు ఎగిరిశెట్టి రాజు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ సిలివేరు సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

# కాలనీవాసుల సమస్యలకు త్వరిత పరిష్కారం దిశగా చర్యలు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి

ఎల్బీనగర్, డిసెంబర్ 23 (భారత శక్తి): గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని త్యాగరాజనగర్ కాలనీలో గత కొన్ని నెలలుగా డ్రైనేజ్ లోడ్ అధికంగా పెరగడం కారణంగా తరచూ బ్లాకేజీలు ఏర్పడి, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజ్ నీరు రోడ్లపైకి రావడం, దుర్వాసనతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తే పరిస్థితి ఏర్పడటంతో కాలనీవాసులు ఈ సమస్యను స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. కాలనీవాసుల సమస్యలను అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, వెంటనే స్పందించి మంగళవారం ఉదయం జలమండలి కాంట్రాక్టర్ శ్రీకాంత్ తో కలిసి త్యాగరాజనగర్ కాలనీలో పర్యటించారు. కాలనీలోని ప్రధాన డ్రైనేజ్ లైన్లు, తరచూ బ్లాకేజీ అవుతున్న ప్రాంతాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను కార్పొరేటర్ కి వివరించగా, డ్రైనేజ్ సామర్థ్యం ప్రస్తుతం ఉన్న జనాభా అవసరాలకు సరిపోవడం లేదని, అందువల్ల శాశ్వత పరిష్కారం అవసరమని వారు విన్నవించారు. సమస్య తీవ్రతను పూర్తిగా అర్థం చేసుకున్న కార్పొరేటర్, అక్కడికక్కడే జలమండలి అధికారులతో ఫోన్



ద్వారా మాట్లాడి, డ్రైనేజ్ వ్యవస్థను సాంకేతికంగా సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. అవసరమైతే పాత డ్రైనేజ్ పైప్ లైన్ల స్థానంలో కొత్త, అధిక సామర్థ్యం గల డ్రైనేజ్ పైప్ లైన్ ఏర్పాటు చేయడానికి తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా, తాత్కాలికంగా బ్లాకేజీ సమస్యలు పునరావృతం కాకుండా తక్షణ శుభ్రపరిచే పనులు చేపట్టాలని కూడా ఆదేశించారు.త్యాగరాజనగర్ కాలనీవాసుల సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా తన వంతు పూర్తి సహకారం అందిస్తానని కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, క్షేత్రస్థాయిలో పరిష్కారం చూపడమే తన లక్ష్యమని, గడ్డిఅన్నారం డివిజన్ అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని ఆయన తెలిపారు. కాలనీవాసులు కార్పొరేటర్ తక్షణ స్పందనకు, సమస్యపై చూపిన చొరవకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మురళి, ఫణి, భీమ్ రావు, మధు, రవి తదితరులు జలమండలి సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు..



# ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప

ఎల్బీనగర్, డిసెంబర్ 23 (,భారత శక్తి): బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ అభయ ఆంజనేయస్వామి కమిటీ వారి ఆధ్వర్యంలో శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వాములకు నిర్వహిస్తున్న నిత్యం అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో మంగళవారం బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, కవిత ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ కొత్త శ్రీధర్ గౌడ్, ఎం. సురేష్ గౌడ్, గురుస్వాములు గడ్డం దాసు గౌడ్, బి. మల్లేష్ యాదవ్, స్వాములు నీలా రాజ శేఖర్ గౌడ్, రాంబాబు గౌడ్,జగన్ గౌడ్, సైదులు, శివ,వర్షిత్ గౌడ్,సుకేష్ ,చారి రవి,విష్ణు బాలరాజు బిజెపి పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు పవన్ రెడ్డి, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షులు మహేష్ గౌడ్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

# హైదరాబాద్‌లో కొనసాగుతున్న బుక్ ఫెయిర్

దోమల్ గూడ, డిసెంబర్ 23 (భారత శక్తి): హైదరాబాద్ నగరంలో జరుగుతున్న 38వ నేషనల్ బుక్ ఫెయిర్ పుస్తక ప్రియులతో కిటకిటలాడుతోంది. ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈ బుక్ ఫెయిర్‌కు ప్రతిరోజూ వేలాది మంది సందర్శకులు తరలివస్తున్నారు. తెలుగు, ఇంగ్లిష్‌తో పాటు హిందీ, ఉర్దూ సహా వివిధ భాషల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రముఖ ప్రచురణ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లలో సాహిత్యం, జోతిష్యం,విజ్ఞానం, పోటీ పరీక్షలు, పిల్లల పుస్తకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. బుక్ ఫెయిర్ సందర్భంగా సాహిత్య కార్యక్రమాలు, రచయితలతో ముఖాముఖి, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. పాఠకులు ఈ సద్వినియోగం చేసుకుంటూ పుస్తకాలు కొనుగోలు చేస్తున్నారు.ఈ పుస్తక ప్రదర్శన ఈ నెల 29 వరకు సాగనుంది.







# సీనియర్ సివిల్ జడ్జి అనూషను కలిసిన సురక్ష సేవా సంఘం కార్యవర్గం

* మారు మూల గ్రామాలలో న్యాయ సహాయంపై దృష్టి పెట్టండి...
* సురక్ష సేవా సంఘంతో డిఎల్ఎస్ కార్యదర్శి శ్రీమతి జీ.అనూష

ఎల్బీనగర్, డిసెంబర్ 23 (భారత శక్తి): రెండు తెలుగు రాష్ట్రాల్లో సంఘ సమాజ సేవలో ఎంతో పేరు గాంచిన సురక్ష సేవా సంఘం తెలంగాణ కార్యవర్గ సభ్యులు మంగళవారం నూతనంగా నియమితులైన రంగారెడ్డి జిల్లా డిఎల్ఎస్ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జీ.అనూషని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జీ. అనూష మాట్లాడుతూ, జిల్లాలో గ్రామీణ ప్రాంతానికి చెందిన ప్రజలలో న్యాయ చైతన్యం తీసుకు రావాలని ఆమె మాట్లాడటం జరిగింది. పేద ప్రజల ఔన్నత్యానికి సురక్ష లాంటి స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్, న్యాయ సలహాదారులు బుద్దె కమలాకర్, కార్యవర్గ సభ్యులు నరసింహ చారి, శ్రీమతి నాగమణి పాల్గొన్నారు.

# సురక్షిత డ్రైవింగ్ విధానాలు పాటించడం ద్వారా రహదారి ప్రమాదాలను నివారించవచ్చు

**: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 23 (భారతశక్తి): సురక్షిత డ్రైవింగ్ విధానాలు పాటించడం ద్వారా రహదారి ప్రమాదాలను నివారించవచ్చని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల విజయవంతమైన నిర్వహణ కోసం ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, ఇతర ఉన్నతాధికారులతో హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, రోడ్డు భద్రతపై



అవగాహన కార్యక్రమాలు, ప్రమాద ప్రదేశాల గుర్తింపు, ట్రాఫిక్ నియంత్రణ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, లైసెన్స్/వాహనాల నియంత్రణ మరియు అత్యవసర వైద్య సౌకర్యాల ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి దుర్గాప్రసాద్, అధికారులు నర్సయ్య, శ్రీనివాస, బోజన్న, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ సోదాలు.. మహబూబ్‌నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వద్ద రూ.36 కోట్ల ఆస్తుల గుర్తింపు

మహబూబ్ నగర్, డిసెంబర్ 23 (భారతశక్తి): మహబూబ్‌నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కిషన్ నాయక్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై ఏసీబీ అధికారులు ఆయన నివాసంలో సోదాలు నిర్వహించారు. ఈ రోజు ఉదయం నుంచి హైదరాబాద్ బోయినపల్లిలోని ఆర్ఆర్ నగర్‌లోని ఆయన నివాసంతో పాటు దాదాపు 12 ప్రాంతాల్లో




అధికారులు సోదాలు నిర్వహించి పెద్ద మొత్తంలో ఆస్తులను గుర్తించారు. గుర్తించిన ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.36 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు, షాపింగ్ కాంప్లెక్సులు, హోటళ్లు, స్థిర, చరాస్తులను గుర్తించారు. బ్యాంకు లాకర్లలో కిలోన్నర బంగారాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారులు హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలతో పాటు వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. కిషన్ నాయక్ 2024 డిసెంబర్‌లో మహబూబ్ నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాలపై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది.

## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

ఒడిశా, డిసెంబర్ 23 (భారతశక్తి): ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒడిశా మల్కాన్‌గిరి జిల్లాలో 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు, ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులు పోలీసులకు ఆయుధాలను అప్పగించారు. వీటిలో ఒక ఏకే 47, రెండు ఇన్సాస్ రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, మూడు 303 రైఫిళ్లు, రెండు సింగిల్ షాట్ రైఫిళ్లు, అలాగే 14 ల్యాండ్‌మైన్‌లు ఉన్నాయి. పోలీసుల వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ 22 మంది మావోయిస్టులపై మొత్తం రూ.2.18 కోట్ల రివార్డు ఉంది. తాజా లొంగుబాటు ఏఓబీ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు భారీ ఎదురుదెబ్బ అని పోలీసు అధికారులు తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రకటించిన నేపథ్యంలో భద్రతా బలగాలు ఆపరేషన్ కగార్, ఆపరేషన్ కర్రెగుట్ట వంటి ప్రత్యేక దాడులను ముమ్మరం చేశాయి. ఈ ఆపరేషన్లలో పలువురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో హతం కాగా, పెద్ద సంఖ్యలో మావోలు పోలీసుల ముందు లొంగిపోతున్నారు.

## చైనా, పాకిస్థాన్‌తో వివాదాలు..
## యుద్ధాలకు సిద్ధంగా ఉండాలని సీడీఎస్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ, డిసెంబర్ 23 (భారతశక్తి): స్వల్పకాలిక, దీర్ఘకాలిక యుద్ధాలకు భారత్ సంసిద్ధంగా ఉండాలని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అణు సామర్థ్యం కలిగిన చైనా, పాకిస్థాన్ నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఐఐటీ బాంబేలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఉగ్రవాదం, సరిహద్దు వివాదాలు సవాళ్లుగా ఉన్నాయని గుర్తు చేశారు. భారత్‌కు ఇద్దరు ప్రత్యర్థులు ఉన్నారని, ఆ రెండు దేశాలు అణ్వాయుధ సామర్థ్యం కలిగి ఉన్నాయని ఆయన తెలిపారు. ఆ దేశాల నుంచి వచ్చే ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు మనం సిద్ధంగా ఉండాలని అన్నారు. గతంలో నిర్వహించిన ఆపరేషన్ల మాదిరిగానే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి స్వల్ప, దీర్ఘకాలిక ఘర్షణలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే కొనసాగుతున్న సరిహద్దు వివాదాల కారణంగా భూతల ఘర్షణల్లో పోరాడేందుకు సంసిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అయితే వీటిని నివారించేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలని అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, హైపర్ సోనిక్స్, రోబోటిక్స్, ఎడ్జ్ కంప్యూటింగ్ యుద్ధ తీరును మారుస్తున్నాయని అన్నారు.

## సుప్రీంకోర్టులో ఏఎస్‌జీగా కనకమేడల..

ఢిల్లీ, డిసెంబర్ 23 (భారతశక్తి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్‌కు కేంద్ర ప్రభుత్వంలో కీలక పదవి లభించింది. సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్‌గా (ఏఎస్‌జీ) ఆయన్ను నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ నియామకంతో కనకమేడల సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కీలక కేసుల్లో వాదనలు వినిపిస్తారు. అదనపు సొలిసిటర్ జనరల్ పదవి కేంద్ర ప్రభుత్వ న్యాయవ్యవస్థలో అత్యంత ముఖ్యమైనది. అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌కు సహాయకుడిగా వ్యవహరిస్తూ, సుప్రీంకోర్టు, హైకోర్టులలో ప్రభుత్వం తరఫున వాదించాల్సి ఉంటుంది. కనకమేడల రవీంద్ర కుమార్‌కు న్యాయ, రాజకీయ రంగాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆయన సీనియర్ న్యాయవాదిగా సుప్రీంకోర్టు, హైకోర్టులలో పలు కీలక కేసులను వాదించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున కూడా గతంలో వాదనలు వినిపించారు. రాజ్యాంగం, పరిపాలన అంశాలపై ఆయనకు మంచి పట్టు ఉంది. 2018 నుంచి 2024 వరకు టీడీపీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా పనిచేసి, పార్లమెంటులో చురుకైన పాత్ర పోషించారు. టీడీపీ లీగల్ సెల్‌లోనూ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ కీలక భాగస్వామిగా ఉన్న తరుణంలో, ఆ పార్టీకి చెందిన నేతకు ఇంతటి ముఖ్యమైన న్యాయ పదవి దక్కడం రాజకీయంగా కీలక పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. దీనివల్ల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కేసుల్లో బలమైన న్యాయ ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉందని చెబుతున్నారు.

## శ్రీహరికోటలో బ్లూబర్డ్ బ్లాక్2 మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం

శ్రీహరికోట, డిసెంబర్ 23 (భారతశక్తి): కొత్త తరం అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్ 6ను మోసుకెళ్లే ఎల్‌వీఎం3 ఎం6 రాకెట్ ప్రయోగానికి 24 గంటల కౌంట్‌డౌన్ మంగళవారం శ్రీహరికోటలో ప్రారంభమైనట్లు ఇస్రో ప్రకటించింది. బ్లూబర్డ్ బ్లాక్2 మిషన్ కౌంట్ డౌన్ ప్రారంభమైందని, రేపు ఉదయం 8.54 గంటలకు రాకెట్ నింగిలోకి ఎగరనున్నట్లు వెల్లడించింది. ఈ ఉపగ్రహం బరువు సుమారు 6,100 కిలోలు ఉంటుంది. స్పేస్‌పోర్ట్‌లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ఎల్‌వీఎం3 ఎం6 వ్యోమనౌకను ప్రయోగించనున్నట్లు ఇస్రో అధికారులు తెలిపారు. అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తోంది. శాటిలైట్ ద్వారా నేరుగా మొబైల్ కనెక్టివిటీ కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు ఈ బ్లూబర్డ్ బ్లాక్2 మిషన్. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా, ఏ సమయంలోనైనా నేరుగా 4జీ, 5జీ వాయిస్, వీడియో కాల్స్, మెసేజ్‌లు, వీడియో ప్రసారాలు చేసేందుకు వీలుగా ఈ ప్రయోగం చేపట్టారు. వాణిజ్య, ప్రభుత్వ అప్లికేషన్లకు సపోర్ట్ చేసేలా దీనిని రూపొందించారు.

## అసెంబ్లీకి రాని కేసీఆర్ మీడియా సమావేశంలో
## ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు

హైదరాబాద్, డిసెంబర్ 23 (భారతశక్తి): రెండేళ్లుగా అసెంబ్లీకి హాజరు కాని కేసీఆర్ మీడియా సమావేశంలో మాత్రం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం చిమ్ముతున్నారని ఆయన విమర్శించారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయలేదని అన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం ప్రతి సంవత్సరం రూ.12,500 కోట్లు విద్యుత్ శాఖకు ప్రభుత్వం చెల్లిస్తోందని భట్టివిక్రమార్క తెలియజేశారు. బీఆర్ఎస్ నాయకులు తోలు తీస్తామంటూ దిగజారి మాట్లాడుతున్నారని, తాము వారిలా మాట్లాడలేమని పేర్కొన్నారు. అలా మాట్లాడే వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నారని భట్టివిక్రమార్క అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్ లకు
## నోటీసులు ఇవ్వాలని సిట్ నిర్ణయం!..

హైదరాబాద్, డిసెంబర్ 23 (భారతశక్తి): తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు నోటీసులు జారీ చేయాలని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ణయించింది. ఈ నిర్ణయంపై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ స్పందిస్తూ, దీనిని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. తనతో పాటు ఎందరో నేతల ఫోన్లను ట్యాప్ చేయడమే కాకుండా, కుటుంబాల్లో చిచ్చు పెట్టారని విమర్శించారు. "కన్నబిడ్డ, అల్లుడి ఫోన్లనూ ట్యాప్ చేయించి, ఎంతో పేరున్న ఎస్ఐబీ వ్యవస్థను భ్రష్టు పట్టించారు" అని మండిపడ్డారు. ఎస్ఐబీని అడ్డుపెట్టుకొని కాంట్రాక్టర్లు, నేతల నుంచి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై కూడా సమగ్ర దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే, ఈ విచారణపై ఆయన పలు సందేహాలు వ్యక్తం చేశారు. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటారా, లేక దోషులను తేలుస్తారా



అని ప్రశ్నించారు. "ఫోన్ ట్యాపింగ్ కేసు మొదలైనప్పుడు ప్రారంభమైన టీవీ సీరియళ్లు కూడా పూర్తయ్యాయి కానీ, ఈ కేసు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది" అని ఎద్దేవా చేశారు. విచారణ అధికారులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, ఈ కుట్ర వెనుక ఉన్న సూత్రధారులను బయటపెట్టాలని ఆయన కోరారు.

## సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్
## 2K26 పోస్టర్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు


విజయవాడ, డిసెంబర్ 23 (భారతశక్తి): రాష్ట్రంలోని పాఠశాల, కళాశాల విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందడుగు వేసింది. ఇందులో భాగంగా 'సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్ 2K26' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ రాకెట్రీ ఛాలెంజ్ ఫైనల్స్ 2026 జనవరి 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు మూడు రోజుల పాటు గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో జరగనున్నాయి. ఈ పోటీలను రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నారు. 16 ఏళ్లకు పైబడిన కళాశాల విద్యార్థుల కోసం 'కెమికల్ రాకెట్రీ', 6 నుంచి 12 ఏళ్ల మధ్య వయసున్న పాఠశాల విద్యార్థుల కోసం 'హైడ్రో రాకెట్రీ' విభాగాల్లో పోటీలు ఉంటాయి. సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు



మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ముఖ్యమంత్రికి వివరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, ఆలోచనలను వెలికితీయడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలని ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువత.. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ sciencecity.ap.gov.in/rocketry_challenge.aspx ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

# ఢిల్లీలో బంగ్లాదేశ్ హైకమిషన్ ఎదుట ఉద్రిక్తత

బంగ్లాదేశ్, డిసెంబర్ 23 (భారతశక్తి): బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడు దీపు చంద్ర దాస్ హత్యకు నిరసనగా న్యూఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ ఎదుట నిరసనలు కొనసాగుతున్నాయి. గత వారం మైమెన్సింగ్ జిల్లాలో ఇస్లామిస్ట్ గుంపు దాడిలో దీపు దారుణంగా హత్యకు గురికావడం దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేపింది. ఈ ఘటనను ఖండిస్తూ విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, దేవాలయాల ధ్వంసం తక్షణమే



ఆపాలని వారు డిమాండ్ చేశారు. నిరసనల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు హైకమిషన్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మూడు వరుసల బారికేడ్లు ఏర్పాటు చేసి, పోలీసు, పారా మిలిటరీ దళాలను మోహరించారు. అయినప్పటికీ కొంతమంది నిరసనకారులు బారికేడ్లను తోసుకుంటూ ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీపు దాస్‌కు న్యాయం చేయాలంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. "ఈరోజు మనం గొంతెత్తకపోతే, రేపు ప్రతి ఒక్కరూ దీపే అవుతారు" అంటూ ఒక నిరసనకారి చేసిన వ్యాఖ్య అక్కడి ఉద్రిక్తతను ప్రతిబింబించింది. ఈ నెల 19న బంగ్లాదేశ్ మైమెన్సింగ్‌లోని బలూకాలో 25 ఏళ్ల గార్మెంట్ ఫ్యాక్టరీ కార్మికుడు దీపు చంద్ర దాస్‌పై దైవదూషణ ఆరోపణలతో గుంపు దాడి చేసి, అతని మృతదేహాన్ని తగలబెట్టడం కలకలం రేపింది. ఈ ఘటనలో ఇప్పటివరకు కనీసం 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇదిలా ఉంటే... భారత్‌లోని బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాలపై జరిగిన నిరసనలపై బంగ్లాదేశ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో భారత హైకమిషనర్‌ను పిలిపించి నిరసన తెలిపింది. దౌత్య కార్యాలయాలపై హింస, బెదిరింపులు అంతర్జాతీయ ప్రమాణాలకు విరుద్ధమని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ నెల 20న ఢిల్లీలో నిరసన, 22న సిలిగురిలోని బంగ్లాదేశ్ వీసా కేంద్రంపై జరిగిన విధ్వంసాన్ని ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని భారత్‌ను కోరింది.

# పదేండ్లలో కేసీఆర్ దాష్టీకం మరిచిపోలే...

* అసెంబ్లీకి రాండి...నువ్వు చేసిన అరాచకాలపై చర్చిద్దాం.
* విరుచుకుపడ్డ డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యే మేడిపల్లి
* మాజీ కేంద్ర మంత్రి వెంకటస్వామికి ఘననివాళి




కరీంనగర్, డిసెంబర్ 23 (భారతశక్తి ప్రతినిధి): పదేండ్లలో చేసిన అరాచకం, దాష్టీకం, తెలంగాణ ప్రజలు మరిచిపోలేదని మాజీ సీఎం కేసీఆర్ పై విరుచుకుపడ్డారు. కేసీఆర్ అహంకార పూరితమైన పదేళ్ల పాలనను ప్రజలు మరో పది దశాబ్దాల వరకు గుర్తుపెట్టుకుంటారని మండిపడ్డారు. రెండేళ్లుగా పామ్ హౌజ్ ను వదిలి రావడం సంతోషంగా ఉందన్నారు. నగరంలోని పద్మనగర్లో గల జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ కేంద్ర మంత్రి, స్వర్గీయ గడ్డం వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అరపెల్లి మోహన్, మాజీ ఎంఎంసీ చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డి, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ లతో కలసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో పై విధంగా కేసీఆర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో నదీజలాలపై ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్ తో చేసిన ఒప్పందాలు, మాజీ మంత్రి రోజా ఇంట్లో చేపల పులుసు తిన్నది ఎప్పటికీ ఈ ప్రజలు మదిలో ఉంటున్నారు. ఇప్పటికైనా కేసీఆర్ మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ కి రావాలని ఎన్నోసార్లు రావాలి ఆహ్వానించారని రాకుండా పామ్ హౌజ్ ను వదల్లేదని గుర్తుచేశారు. అసెంబ్లీకి వస్తె పదేళ్లలో చేసిన మీ అరాచకాలతో పాటు ప్రస్తుతం మా ప్రజాపాలన లో చేసిన సంక్షేమ పథకాలపై చర్చిద్దాం రావాలని కోరుతున్నాము రాకుండా మా ముఖ్యమంత్రిపై అసత్యపు ఆరోపణలు చేస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ఇంట్లో గెలిచి రచ్చ గెలవాలని అన్నారు పెద్దలు...బి ఆర్ ఎస్ పార్టీకి అతి లేదు... అతిగతి లేదు...పార్టీ ముక్కలయిందనీ...కన్నా కూతురు కవిత రోడ్డెక్కిందని, కెసిఆర్ తప్పులను ఎండగతునే ఉందన్నారు. పార్టీలో వర్గ పోరుతో పార్టీని చక్కదిద్దే పనిలో నిమగ్నం కాకుండా సీఎం రేవంత్ రెడ్డి పాలనకు ప్రజలు జేజేలు పలుకుతుంటే ఓర్వలేక తనకున్న ఆక్రోశం వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు.



## ఏఐసిసి ఇన్చార్జ్ కు సన్మానం చేసిన జిల్లా కాంగ్రెస్ నేతలు

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, డిసెంబర్ 23: ఖమ్మం జిల్లాకు విచ్చేసిన ఏఐసిసి ఇన్చార్జ్ విశ్వనాథన్ ను జిల్లా కాంగ్రెస్ నేతలు మంగళవారం ఘనంగా సన్మానించారు. జిల్లాకు వచ్చిన ఆయనను రాష్ట్ర యువ నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ బాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ వడ్డేబోయిన నరసింహారావు, ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, సీనియర్ నాయకులు శెట్టి రంగారావు, కెకెసి జిల్లా అధ్యక్షులు సి హెచ్ విప్లవ్ కుమార్, టూటౌన్ కాంగ్రెస్ నాయకులు నల్లమల వేణు, సోమిరెడ్డి ఉపేందర్ రెడ్డి, పాలడుగు నాగేశ్వరరావు మరియు నాంపల్లి శంకరయ్య తదితరులు కలిసి శాలువాతో పూలమాలతో సత్కరించారు. జిల్లాలో నెలకొన్న పరిస్థితులు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల గురించి పార్టీ బలోపేతం అంశాలపై చర్చించినట్లు వారు తెలిపారు.

## అన్నదాతలకు అధిక లాభం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం

: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, డిసెంబర్ 23 (భారత శక్తి) : అన్నదాతలకు అధిక లాభం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వ మద్దతు ధరకంటే తక్కువగా రైతులు ధాన్యాన్ని అమ్ముకునే పరిస్థితి రాకూడదని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం చెన్నూరు మండలం రామన్నపల్లె గ్రామ సచివాలయాన్ని, రైతు సేవా కేంద్రంను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రంలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కడప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖరీఫ్ 202526 సీజన్ కి సంబంధించి ధాన్యం కొనుగోలు కార్యక్రమంను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. సంబందిత రైతు సేవా కేంద్ర సిబ్బందికి, గ్రామ వ్యవసాయ సహాయకుల (వీఏఏ)కు రైతుల వివరములు నమోదు, నాణ్యతా విశ్లేషణ, ధాన్యం కొనుగోలు తదితర అంశాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ గిట్టుబాటు ధరను కల్పించి, వారికి లాభం చేకూర్చేలా ప్రభుత్వం ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్ పంటధాన్యం కొనుగోలును నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ గిట్టుబాటు ధరకంటే ఏ మాత్రం తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితి రైతులకు రాకూడదని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. అన్ని రకాల పంటలకు సంబంధించి కొనుగోలు ధరల పట్టికలను ఆయా రైతు సేవా కేంద్రాల్లో పోస్టర్ల ద్వారా ప్రదర్శించాలన్నారు. రైతులకు సంబందించి ఎలాంటి సందేహాలున్నా.. తెలియజేయాలన్నారు.

* సచివాలయ పరిశీలన..

రామన్నపల్లె గ్రామ సచివాలయాన్ని జిల్లా.కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.ఆకస్మికంగా పరిశీలించారు. సచివాలయంలో అందిస్తున్న సేవల వివరాలు, సిబ్బంది అటెండెన్స్, సేవలపై ప్రజల సంతృప్తి స్థాయి తదితర వివరాలను విఆర్ఓ, ఆయా విభాగాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సరస్వతి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ వి. నాగ సుధ, మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీదేవి, గ్రామ వ్యవసాయ సహాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### ఘనంగా సర్పంచ్ ల
## ప్రమాణ స్వీకారం మహోత్సవాలు

ఉమ్మడి వరంగల్ బ్యూరో (భారత శక్తి) డిసెంబర్ 23: శాయంపేట మండలంలోని 24 గ్రామాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయా పంచాయతీ కార్యదర్శులు వారిని ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సర్పంచులు వారి సీట్లలో ఆసీనులై కొలువులు తీరారు. శాయంపేట చింతల ఉమా, ఆరేపల్లి దున్నాల రమ, అప్పయ్య పల్లి గౌడ గాని సుప్రియ, జోగంపల్లి మారమైన ప్రభాకర్, గోనె నాగరాజు నర్సింహులపల్లి, నూర్జాగాని అల్లేరాజీరు, రాజు పల్లి మల్పని లక్ష్మణరావు, సాధన పల్లి మిట్టపల్లి సతీష్, హుస్సేన్పల్లి ఎడ్ల స్వరూప, సూర్య నాయక్ తండ లౌడియా రమ, కాట్రపల్లి వాంకుడోత్ సదర్, గోవిందా పూర్ కట్టెల స్వామి, గంగిరేణి గూడెం కత్తుల కుమారస్వామి, కొత్తగట్టు సింగారం కూకిడి శివాజీ, గట్లఖనిపర్తి వైనాల విజయ, మైలారం నూనె దివ్య, నేరేడుపల్లి మడికొండ ఇందిర, వసంతపూర్ హింగే భాస్కర్, తరహారాపూర్ కుక్కల సరోజన, ప్రగతి సింగారం మాదారం సరోజన, సూరంపేట సూర్యం శశిపాల్ రెడ్డి, కొప్పుల మామిడి అశోక్, పత్తిపాక గజ్జి ఐలయ్య, పెద్దకోడపాక మంద దీనా దామర మండలంలోని సీతారాంపురం గ్రామ సర్పంచ్ పెండ్లి రాజు, ఉపసర్పంచ్ భూస వరప్రసాద్, ఆత్మకూరు మండలం చౌల్లపల్లి గ్రామ సర్పంచ్ మోరే రాజేశ్వరరావు, ఉపసర్పంచ్ పూజారి కుమారస్వామిలు ప్రమాణ స్వీకారం చేశారు.

## రాధిక కాన్సెప్ట్ స్కూల్లో ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు




మణుగూరు, డిసెంబర్ 23 (భారతశక్తి): మండలంలోని రాధిక కాన్సెప్ట్ స్కూల్ యాజమాన్యం ముందస్తుగా సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ నగర్ లో గల రాధిక కాన్సెప్ట్ స్కూల్లో విద్యార్థులు శాంటా క్లాజ్ డ్రస్సు లతో, తెల్లని రంగు దుస్తులు ధరించి చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులు నిర్వహించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విద్యార్థులు వివిధ వేషధారణలతో నిర్వహించిన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థుల ఆటపాటలు, వారి ఆటపాటల ద్వారా క్రీస్తు సమాజానికి చూపిన శాంతి సందేశాన్ని వివరించారు. అదేవిధంగా పిల్లలకు వ్యాచరచన పోటీలు నిర్వహించి స్కూల్ యాజమాన్యం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జి. మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్స్ సిహెచ్.జయసింహా రెడ్డి, జి.సంపత్ రెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి, నూకారపు రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం నరేష్, కోఆర్డినేటర్స్ ఉషా, కీర్తి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


## ప్రతి కేసులో నాణ్యమైన ధర్యాప్తు చేసి, బాధితులకు అండగా నిలవండి

* రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్లైన్ మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి
* మంత్లీ క్రైమ్ రివ్యు మీటింగ్ లో భాగంగా అధికారులకు పలు సూచనలు
* జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్




భారతశక్తి ప్రతినిధి, సంగారెడ్డి, డిసెంబర్ 23: సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అండర్ ఇన్వెస్టిగేషన్లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, మిస్సింగ్, ఎబ్.బి.డబ్ల్యూ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇన్వెస్టిగేషన్ లో వేగం పెంచాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు అండగా నిలవాలని అధికారులకు సూచించడం జరిగింది. లాంగ్ పెండింగ్ కేసుల ఛేధనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ఇన్వెస్టిగేషన్లో సందేహాలు ఉంటే, ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలన్నారు.ఎస్.హెచ్.ఓ లు తమ ఏరియాలో గల ప్రతి గ్రామాన్ని సందర్శించి, ఆయా ప్రాంతాలలో గల సమస్యలను తెలుసుకోవాలని అన్నారు. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామలపై పూర్తి అవగాహన కలిగి, ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. రౌడీ షీటర్స్, సస్పెక్ట్ ల కదలికలై నిఘా ఉంచాలన్నారు. బ్లూకోల్ట్స్ మరియు నైట్ పెట్రోలింగ్ సిబ్బంది "పాపిలోన్ డివైస్" లను వినియోగిస్తూ.. అనుమానాస్పద వ్యక్తుల ఫింగర్ ప్రింట్స్ సేకరించాలన్నారు. విమెన్ సేఫ్టీ, రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్లైన్ మోసాల గురించి ఆయా ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరచలాని అన్నారు. అనంతరం యస్.హెచ్.ఓ వాహనాలను తనిఖీ చేస్తూ.. ప్రతి వాహనాన్ని రెగ్యులర్ సర్వీసింగ్ చేయిస్తూ, ఎలాంటి రిపేర్స్ లేకుండా పూర్తి కండిషన్ లో ఉండే విధంగా చూసుకోవాలని డ్రైవరులకు సూచించారు. ముఖ్యంగా డ్రైవర్స్ వాహనాలను ఎట్టి పరిస్థితులలోనూ రాంగ్ రూట్లో నడపరాదని అన్నారు.ఈ సమీక్షా సమావేశంలో అదనపు.ఎస్పీ సిహెచ్. రఘునందన్ రావ్, డియస్పిలు సత్యయ్య గౌడ్, ప్రభాకర్, వెంకట్ రెడ్డి, సైదా నాయక్, సురేందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్స్ రమేష్, కిరణ్ కుమార్, నాగేశ్వర్ రావ్, సదా నాగరాజు, ప్రవీణ్ రెడ్డి, నాగేశ్వర్ రావ్, ఆర్.ఐ లు రామా రావ్, రాజశేఖర్, జిల్లా ఇన్స్పెక్టర్స్, సబ్ఇన్స్పెక్టర్స్, తదితరులు పాల్గొన్నారు.

### సంక్రాంతి స్పెషల్..
## ఈ 16 రైళ్లు హైటెక్ సిటీలోనే ఎక్కొచ్చు!




హైదరాబాద్, డిసెంబర్ 23 (భారతశక్తి): సంక్రాంతికి ఊరెళ్తున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో రద్దీని నియంత్రించేందుకు తాత్కాలిక స్టాపేజీని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా పలు ప్రాంతాల మధ్య సర్వీసులందించే 16 రైళ్లకు హైటెక్ సిటీ స్టేషన్లో తాత్కాలిక స్టాపేజీ కల్పించింది. దీంతో జనవరి 7 నుంచి 20వ తేదీ వరకు హైటెక్సిటీ పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రయాణికులు ఈ రైళ్లను హైటెక్ సిటీ రైల్వే స్టేషన్లోనే ఎక్కొచ్చు. ఈ మేరకు ఆయా రైళ్ల నంబర్లు, గమ్య స్థానాలు, ఆ స్టేషన్కు రైలు చేరుకునే, బయల్దేరే సమయం వంటి వివరాలతో అధికారులు చార్ట్ను విడుదల చేశారు.

## 3 నెలలకోసారి కార్యదర్శుల పనితీరుపై సమీక్షిస్తా: సీఎం రేవంత్రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 23 (భారతశక్తి): అధికారులు సమన్వయం చేసుకొని పనిచేయడం కీలకమని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అన్నారు. సచివాలయంలోని అన్ని విభాగాల కార్యదర్శులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. శాఖల మధ్య, అధికారుల మధ్య సమన్వయం లేకపోతే ఎలాంటి ఫలితాలు రావని సీఎం అన్నారు. ప్రతి నెలా కార్యదర్శుల పనితీరుపై సీఎస్ సమీక్షిస్తారని తెలిపారు. ప్రతి నెల కార్యదర్శులు.. సీఎస్కు నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. ప్రతి 3 నెలలకోసారి కార్యదర్శుల పనితీరుపై స్వయంగా సమీక్షిస్తానని సీఎం చెప్పారు. ''అధికారులు సమన్వయం చేసుకొని పనిచేయడం కీలకం. అభివృద్ధి విషయంలో సమన్వయం కోసం మెకానిజం ఉండాలి. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయ్యింది. రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించాం.. ప్రణాళికలు రూపొందించుకున్నాం. గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ పాలసీలు లేవు. దీంతో అనేక సమస్యలు వచ్చాయి. ముఖ్యమైన విభాగాలకు పాలసీలు తీసుకొచ్చాం. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశాం. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్గా విభజించి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. స్పష్టమైన విధానాలతో ముందుకెళ్తున్నాం. గొప్ప కార్యాచరణ అమలుకు అధికారుల సహకారం ఉండాలి'' అని సీఎం అన్నారు. సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.